# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY

manavishwam.com

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 98 | గురువారం 24 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్



మీ కలానికి.. ఇదే వేదిక!

మన విశ్వం

జిల్లా ప్రతినిధులు

నియోజకవర్గ రిపోర్టర్లు

కావలెను

వార్త మీ బలం అయితే.. 'మన విశ్వం' మీ వేదిక!

630 563 8569

900 096 7680





# ఈ పాపం ఎవరిది.. సీఎం సాబ్?

## రిమ్స్‌లో ఐదుకు చేరిన శిశు మరణాలు

- ఎస్ఎన్‌సీయూలో మంటల తర్వాత ఆగని విషాదం
- ఏసీకి ముందే సమస్య.. వారం కిందటే మరమ్మతు
- సేఫ్టీ ఆడిట్లు జరిగినా ప్రమాదం ఎలా?..
- నిర్వహణపై ప్రశ్నలు విచారణకు సీఎం ఆదేశం..
- బాధ్యులపై చర్యలంటున్న ఆరోగ్య మంత్రి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (మన విశ్వం):** ఒకటి కాదు.. రెండు కాదు.. ఐదు పసిప్రాణాలు. బతికించాలనే ఆశతో రిమ్స్‌కు తీసుకొచ్చిన నవజాత శిశువుల కుటుంబాలకు అగ్నిప్రమాదం తీరని కడుపుకోత మిగిల్చింది. ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (ఎస్ఎన్‌సీయూ)లో సోమవారం రాత్రి చెలరేగిన మంటల అనంతరం శిశు మరణాల సంఖ్య ఐదుకు చేరింది. తొలుత ముగ్గురు శిశువులు మృతి చెందగా, చికిత్స పొందుతున్న మరో ఇద్దరు బుధవారం ప్రాణాలు కోల్పోయారు.

**అర్ధరాత్రి మంటలు.. క్షణాల్లో పొగ**

ఎస్ఎన్‌సీయూలోని విండో ఏసీలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్లాస్టిక్ కాలడంతో దట్టమైన పొగ వార్డును కమ్మేసింది. సిబ్బంది శిశువులను హుటాహుటిన బయటకు తరలించారు. పొగ ప్రభావంతో చిన్నారుల ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి కచ్చితమైన కారణం మాత్రం అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

**ముందే ఏసీ సమస్య..**
**మరి పర్యవేక్షణ ఏది?**

ప్రమాదానికి కారణమైందని అనుమానిస్తున్న ఏసీకి గతంలోనే సమస్య తలెత్తగా, వారం కిందట మరమ్మతు చేసినట్లు అధికారులు వెల్లడించారు. రిమ్స్‌లో ఫైర్, ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్లు కూడా

మిగతా 2లో..



## రిమ్స్ బాధితులకు రూ.25 లక్షలు ఇవ్వాలి

- చిన్నారుల కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు
- వైద్య వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యమంటూ విమర్శ
- చికిత్స పొందుతున్న చిన్నారులకు రూ.10 లక్షల సాయం చేయాలని డిమాండ్

వివరాలు 2లో..

రిమ్స్‌లో చిన్నారులవి..

## ప్రభుత్వ హత్యలే!

- ఐదుగురు పసికందుల మృతిపై కవిత ఆగ్రహం
- దత్తత జిల్లాలో ఇంతటి విషాదం జరిగితే సీఎం రారా?
- బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్
- వైద్య వ్యవస్థపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ
- నెల రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఆదిలాబాద్ ఘెరావ్

వివరాలు 2లో..





## రిమ్స్ విషాదం..

**సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనం!**

- పసికందుల మృతి తీవ్ర దిగ్భ్రాంతికరం
- బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలి
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలు కఠినంగా అమలు చేయాలి
- మౌలిక వసతుల ఆధునీకరణకు తక్షణమే నిధులివ్వాలి
- రాజకీయ డ్రామాలు పక్కనపెట్టి ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలి
- మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్

వివరాలు 2లో..




# రవాణాశాఖను తవ్వితే.. ఇంకెన్ని కోట్లు?

- ఏసీబీ దాడుల్లో బయటపడుతున్న భారీ ఆస్తుల వ్యవహారాలు
- ఎంవీఐ నుంచి డీటీసీ వరకు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు
- గౌస్‌పాషా కేసులో రూ.3.51 కోట్లు.. కిషన్‌నాయక్ కేసులో రూ.12.72 కోట్ల రికార్డు విలువ
- ఆర్టీఏల్లో ఏజెంట్లు.. చెక్‌పోస్టుల్లో లెక్కల్లో లేని నగదు
- 2024 నుంచి వరుస ట్రాప్‌లు, ఆకస్మిక తనిఖీలు
- ఆదాయం-ఆస్తులపై రాష్ట్రవ్యాప్త 'స్పెషల్ డ్రైవ్' చేపట్టాలన్న డిమాండ్

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 23 (మన విశ్వం):** ఐదు వేలు.. 22వేలు..25వేలు.. ఇవి కొన్ని ఏసీబీ ట్రాప్ కేసుల్లో నమోదైన లంచం మొత్తాలు. మరోవైపు కోట్ల రూపాయల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు. మధ్యలో ఆర్టీఏ కార్యాలయాల్లో ఏజెంట్లు.. చెక్‌పోస్టుల్లో లెక్కల్లో లేని నగదు. 2024 నుంచి రవాణాశాఖలో నమోదైన వరుస ఏసీబీ చర్యలు శాఖలో అవినీతి నిరోధక పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలన్న డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నాయి.

**12 చోట్ల ఒకేసారి తనిఖీలు**

2024 మేలో రాష్ట్రవ్యాప్తంగా 12 ఆర్టీఏ కార్యాలయాలు,

మిగతా 2లో..



# మేయర్ అభ్యర్థిని ఓడగొడతా!

- ఎవరిని బరిలో దింపినా సరే.. కాంగ్రెస్‌ను ఓడిస్తామని రంజిత్‌రెడ్డి సవాల్
- సీఎం ప్రచారం చేసినా వెనక్కి తగ్గేది లేదని వ్యాఖ్య
- నాయిని ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని స్పష్టం
- వరంగల్ పశ్చిమంలో ఎమ్మెల్యే ఎవరు?.. నాయినా, ఆయన అల్లుడా? అంటూ ప్రశ్న
- ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించే వారికే ఓటేయాలని పిలుపు

**హన్మకొండ, సెప్టెంబర్ 23 (మన విశ్వం):** గ్రేటర్ వరంగల్ రాజకీయాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దుగ్గంపూడి రంజిత్‌రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ తరపున ఎవరిని మేయర్ అభ్యర్థిగా నిలబెట్టినా ఓడిస్తామని, ముఖ్యమంత్రి ప్రచారం చేసినా వెనక్కి తగ్గేది లేదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తనపై, తనతో ఉన్న యువ నాయకులపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే దేనికైనా సిద్ధమని ప్రకటించారు.

**ఎమ్మెల్యే ఎవరు?.. అల్లుడా?**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డా.. ఆయన

మిగతా 2లో..




# యాదాద్రి బొగ్గుతో.. రూ.40 వేల కోట్ల భారం!

- జీ-9 బొగ్గు అందుబాటులో లేకున్నా ఆ టెక్నాలజీతో ప్లాంట్ ఎందుకు కట్టారు?
- పిట్‌హెడ్ కాకుండా గనులకు దూరంగా నిర్మించడంపైనా సీఎం రేవంత్ ప్రశ్నలు
- రాజకీయ కారణాలతోనే దూరంగా నిర్మించారన్న అధికారులు
- బొగ్గు రవాణాతో రాష్ట్రంపై రూ.40 వేల కోట్ల అదనపు భారమని వెల్లడి
- దసరాలోపు పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తికి సీఎం డెడ్‌లైన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మన విశ్వం):** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం, బొగ్గు సరఫరా వ్యవహారంలో సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్లాంట్‌కు అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో

మిగతా 2లో..

# రామప్పకు.. బొగ్గు గండం?

- ప్రపంచ వారసత్వ కట్టడానికి 5కి.మీ. దూరంలో ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదన
- వెంకటాపూర్‌లో బొగ్గు తవ్వకాలపై హెరిటేజ్ వర్గాల ఆందోళన
- బ్లాస్టింగ్ ప్రకంపనలతో ఆలయంపై ప్రభావం ఉంటుందా?.. కొత్త చర్చ
- భూగర్భ జలాలు, రామప్ప చెరువుపైనా అధ్యయనం చేయాలన్న డిమాండ్
- 'నియంత్రిత బ్లాస్టింగ్‌తో ముప్పు లేదు' అంటున్న సింగరేణి
- స్వతంత్ర శాస్త్రీయ అధ్యయనంతో సందేహాలు నివృత్తి చేయాలంటున్న నిపుణులు



**తెలంగాణ బ్యూరో/ములుగు, సెప్టెంబర్ 23 (మన విశ్వం):** ఎనిమిది శతాబ్దాల కాకతీయ శిల్పకళకు నిలువెత్తు సాక్ష్యం.. తెలంగాణలోని యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప ఆలయం. ఇప్పుడు ఈ చారిత్రక సంపదకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోని వెంకటాపూర్ వద్ద ప్రతిపాదిత సింగరేణి ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని కొత్త చర్చకు దారితీసింది. లోతైన తవ్వకాలు, బ్లాస్టింగ్ వల్ల ఆలయం, భూగర్భ జలాలు, రామప్ప చెరువు పరిసరాలపై దీర్ఘకాల ప్రభావం ఉంటుందేమోనని హెరిటేజ్ పరిరక్షణ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**బ్లాస్టింగ్‌తో ఏమవుతుంది?**

ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు వెలికితీతకు చేపట్టే బ్లాస్టింగ్ వల్ల ఏర్పడే ప్రకంపనలు శతాబ్దాల నాటి

మిగతా 2లో..

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# పిల్లల చేతిలో ఫోన్.. ప్రమాదానికి తలుపు కాకూడదు

డిజిటల్ ప్రపంచం పిల్లల చదువుకు, జ్ఞానానికి కొత్త ద్వారాలు తెరిచింది. పాఠాలు, సమాచారం, సృజనాత్మకత.. అన్నీ ఇప్పుడు అరచేతిలోనే అందుబాటులోకి వచ్చాయి. అదే సమయంలో కనిపించని ప్రమాదాలనూ పిల్లలకు చేరువ చేసింది. ఒకప్పుడు పిల్లలు బయటకు వెళ్తే ఎక్కడున్నారు? ఎవరితో ఉన్నారు? అని తల్లిదండ్రులు ఆరా తీసేవారు. ఇప్పుడు ఇంట్లోనే ఉన్నా.. చేతిలోని ఫోన్ ద్వారా వారు ఏ ప్రపంచంలో తిరుగుతున్నారో తెలుసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, చాటింగ్ యాప్స్, వీడియో ప్లాట్‌ఫామ్‌లు పిల్లలను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. వీటి మాటున సైబర్ వేధింపులు, నకిలీ ఖాతాలు, అపరిచితుల పరిచయాలు, మోసపూరిత లింకులు, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి ముప్పులూ పొంచి ఉంటాయి. ఏది నిజం.. ఏది మోసం అన్నది గుర్తించే అనుభవం పిల్లలకు లేకపోవడమే అసలు ప్రమాదం. చిన్న పొరపాటు కూడా కొన్నిసార్లు పెద్ద సమస్యకు దారితీయవచ్చు.

అందుకే పిల్లలకు స్మార్ట్‌ఫోన్ కొనివ్వడంతో తల్లిదండ్రుల బాధ్యత ముగిసిపోదు. వారు ఏం చూస్తున్నారు? ఏ యాప్‌లు ఉపయోగిస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఎంతసేపు ఆన్‌లైన్‌లో ఉంటున్నారు? అనే విషయాలపై అవగాహన ఉండాలి. వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులతో పంచుకోకూడదని ముందుగానే నేర్పించాలి. అపరిచితుల సందేశాలకు స్పందించడం, తెలియని లింకులు తెరవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను అర్థమయ్యేలా చెప్పాలి.

అయితే భద్రత పేరుతో పిల్లలపై నిరంతరం నిఘా పెట్టడమే పరిష్కారం కాదు. ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులకు చెప్పగలిగే నమ్మకాన్ని వారిలో పెంచాలి. మందలిస్తారనే భయంతో పిల్లలు సమస్యలను దాచుకుంటే ప్రమాదం మరింత పెరుగుతుంది. నియంత్రణ కంటే అవగాహన.. అనుమానం కంటే సంభాషణ.. శిక్ష కంటే సరైన మార్గదర్శకత్వం ఎక్కువ ఫలితాన్నిస్తుంది.

మరోవైపు మితిమీరిన స్క్రీన్ టైమ్‌పైనా దృష్టి పెట్టాలి. చదువు పేరుతో మొదలైన ఫోన్ వినియోగం గంటల తరబడి గేమ్స్, వీడియోలు, సోషల్ మీడియాకు పరిమితమైతే పిల్లల రోజువారీ జీవనశైలిపైనా ప్రభావం పడుతుంది. మొబైల్‌కు సమయం ఉన్నట్లే ఆటకు, పుస్తకాలకు, కుటుంబంతో గడిపేందుకు కూడా సమయం ఉండేలా చూడాలి. డిజిటల్ క్రమశిక్షణ పిల్లలకు మాత్రమే కాదు.. పెద్దలకూ అవసరమే.

పాఠశాలల బాధ్యత కూడా ఇక్కడ కీలకం. కంప్యూటర్ ఎలా ఉపయోగించాలో నేర్పినట్లే ఇంటర్నెట్‌ను ఎలా సురక్షితంగా ఉపయోగించాలో చెప్పాలి. సైబర్ బుల్లీయింగ్, నకిలీ ఖాతాలు, ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార రక్షణపై చిన్న వయసు నుంచే అవగాహన కల్పించాలి. కుటుంబం, పాఠశాల కలిసి పనిచేస్తేనే పిల్లలకు బలమైన డిజిటల్ రక్షణ ఏర్పడుతుంది.

పిల్లలను డిజిటల్ ప్రపంచానికి దూరం చేయడం సాధ్యం కాదు.. అవసరమూ కాదు. రేపటి విద్య, ఉపాధి, సృజనాత్మకత అన్నీ సాంకేతికతతోనే ముడిపడి ఉన్నాయి. కానీ ఆ ప్రపంచంలో ఎలా నడవాలో నేర్పించకుండా పిల్లలను ఒంటరిగా వదిలేయడం మాత్రం ప్రమాదకరం.

చేతికి స్మార్ట్‌ఫోన్ ఇచ్చే ముందు దాన్ని సురక్షితంగా ఉపయోగించే 'స్మార్ట్‌నెస్'ను నేర్పాలి. పిల్లల చేతిలో ఫోన్ జ్ఞానానికి తలుపు కావాలి.. ప్రమాదానికి కాదు.

**- నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్**

# యాదాద్రి బొగ్గుతో.. రూ.40 వేల కోట్ల భారం!

**(మొదటిపేజీ తరువాయి)**

లేకపోయినా ఆ గ్రేడ్‌పైనే ఆధారపడే సాంకేతికతతో విద్యుత్ కేంద్రాన్ని ఎందుకు నిర్మించారని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ప్రశ్నించారు. పిట్‌హెడ్ వద్ద కాకుండా బొగ్గు గనులకు దూరంగా యాదాద్రి ప్లాంట్‌ను నిర్మించడం వల్ల బొగ్గు సరఫరాపై రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని అధికారులు సమీక్షలో వెల్లడించా రు. విద్యుత్ శాఖపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. యాదాద్రి థర్మల్ కేంద్రం ఇంకా పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. దసరాలోపు ప్లాంట్ పూర్తిస్థాయి ఉత్పత్తిలోకి వచ్చేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**జీ-9 బొగ్గు ఎక్కడ?**

యాదాద్రి థర్మల్ కేంద్రానికి జీ-9 గ్రేడ్ బొగ్గు అవసరమని అధికారులు వివరించారు. అయితే సింగరేణిలో ప్రస్తుతం ఆ గ్రేడ్ బొగ్గును ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ అక్కడి నుంచి జీ-9 బొగ్గు లభించే అవకాశం లేదని తెలిపారు. దీంతో సీఎం, డిప్యూటీ సీఎం అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. అవసరమైన బొగ్గే రాష్ట్రంలో అందుబాటులో లేనప్పుడు ఆ సాంకేతికతతో ప్లాంట్‌ను ఎలా నిర్మించారు? బొగ్గు గనుల వద్దే పిట్‌హెడ్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేయకుండా దూరంగా ఎందుకు నిర్మించారు? దీనివల్ల రాష్ట్రంపై ఎంత అదనపు భారం పడుతోంది? అని ఆరా తీశారు. అప్పటి రాజకీయ కారణాలతోనే పిట్‌హెడ్ వద్ద కాకుండా యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని దూరంగా నిర్మించినట్లు అధికారులు సమీక్షలో వివరించారు. బొగ్గు సరఫరా కారణంగా రాష్ట్రంపై రూ.40 వేల కోట్ల మేర అదనపు భారం పడుతోందని తెలిపినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**బొగ్గు కోసం కేంద్రంతో చర్చలు**

జీ-9 బొగ్గు సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సూచించారు. మహానది కోల ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి అవసరమైన బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని అధికారులు సమావేశంలో వెల్లడించారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడం వల్ల జీ-9 గ్రేడ్ బొగ్గును సింగరేణి నుంచి సమకూర్చుకునే పరిస్థితి లేదని వివరించారు.

**దసరానే డెడ్‌లైన్**

బొగ్గు సమస్యను కారణంగా చూపుతూ విద్యుత్ ఉత్పత్తిలో జాప్యం కొనసాగించవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ మార్గాల్లో బొగ్గును సమకూర్చుకుని దసరాలోపు యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తిలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. దీంతో ఇప్పుడు రెండు అంశాలు కీలకంగా మారాయి. జీ-9 బొగ్గును ప్రభుత్వం ఎక్కడి నుంచి, ఏ ధరకు సమకూర్చుకుంటుంది? దసరా డెడ్‌లైన్‌లోగా యాదాద్రి ప్లాంట్ పూర్తిస్థాయి ఉత్పత్తిని అందుకుంటుందా? అన్నదానిపై దృష్టి నెలకొంది.

# రామప్పకు.. బొగ్గు గండం?

**(మొదటిపేజీ తరువాయి)**

ఆలయ నిర్మాణంపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నదే ప్రధాన ప్రశ్న. ఒక్కసారిగా కనిపించే నష్టమే కాకుండా ఏళ్ల తరబడి జరిగే తవ్వకాలు, ప్రకంపనల సమష్టి ప్రభావాన్నీ పరిశీలించాలని పరిరక్షణ వర్గాలు కోరుతున్నాయి. భూగర్భ జలాలు, రామప్ప చెరువు పరిసరాలపై ప్రభావాన్ని కూడా ముందుగానే శాస్త్రీయంగా అంచనా వేయాలని అంటున్నాయి. అయితే ఆలయానికి నష్టం జరుగుతుందని ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు.

**'ముప్పు లేదు' అంటున్న సింగరేణి**

సింగరేణి వర్గాల వాదన మాత్రం భిన్నంగా ఉంది. ప్రతిపాదిత గని ఆలయ బఫర్ జోన్‌కు బయట ఉందని, నిపుణుల అధ్యయనాల ఆధారంగా నియంత్రిత బ్లాస్టింగ్ చేపడితే ప్రకంపనలు అనుమతించదగిన పరిమితుల్లోనే ఉంటాయని సంస్థ అధికారులు చెబుతున్నారు. దీంతో పరిరక్షణ వర్గాల ఆందోళనలు, సింగరేణి సాంకేతిక వాదనల మధ్య స్వతంత్ర శాస్త్రీయ పరిశీలనకు ప్రాధాన్యం పెరిగింది.

**బొగ్గూ కావాలి.. రామప్పా నిలవాలి!**

విద్యుత్, పరిశ్రమలకు బొగ్గు అవసరం ఎంత ముఖ్యమో.. శతాబ్దాల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించడం కూడా అంతే కీలకం. అందుకే గని కార్యకలాపాలు ముందుకు వెళ్లే ముందు బ్లాస్టింగ్ ప్రకంపనలు, ఆలయ నిర్మాణ స్థిరత్వం, భూగర్భ జలాలు, రామప్ప చెరువు సహా మొత్తం పరిసరాలపై సమగ్ర శాస్త్రీయ అధ్యయనం జరిపి సందేహాలను నివృత్తి చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

**బొగ్గు తవ్వాలి.. కానీ చరిత్రను కదిలించొద్దు! రామప్ప విషయంలో అభివృద్ధి, వారసత్వ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేయడమే ఇప్పుడు కీలకం.**

# రవాణాశాఖను తవ్వితే.. ఇంకెన్ని కోట్లు?

**(మొదటిపేజీ తరువాయి)**

చెక్‌పోస్టులపై ఏసీబీ ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పలు ప్రాంతాల్లో రూ.2.70 లక్షలకు పైగా లెక్కల్లో చూపని నగదుతో పాటు ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం, విధానపరమైన లోపాలను గుర్తించింది. అంతకుముందు యాదాద్రి భువనగిరి జిల్లా రవాణా అధికారి రూ.5 వేల లంచం కేసులో ఏసీబీకి చిక్కారు.

**ఎంవీఐ నుంచి డీటీసీ వరకు..**

2025లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు మరింత చర్చకు దారితీశాయి. మహబూబాబాద్ ఎంవీఐ మహ్మద్ గౌస్‌పాషాపై నమోదైన కేసులో ఇళ్లు, ప్లాట్లు, వ్యవసాయ భూములు తదితరాలతో కలిపి రూ.3.51 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. అదే ఏడాది డిసెంబర్‌లో మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మూడ్ కిషన్‌నాయక్‌పై నమోదైన కేసులో రూ.12.72 కోట్ల రికార్డు విలువైన ఆస్తులు గుర్తించారు. భూములు, బంగారం, ఇతర ఆస్తులు సోదాల్లో వెలుగుచూశాయి. మార్కెట్ విలువ రికార్డు విలువ కంటే ఎక్కువగా ఉండవచ్చన్న అంచనాలు ఉన్నప్పటికీ తుది విలువ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**ట్రాప్‌లు.. ఏజెంట్లు..**

2025లో జగిత్యాల డీటీవో రూ.22 వేల లంచం కేసులో ఏసీబీకి చిక్కగా, ఆర్మూర్ ఎంవీఐపై రూ.25 వేల లంచం కేసు నమోదైంది. 2026 మార్చిలో వైరా ఎంవీఐపై రూ.24,800 లంచం కేసు నమోదైంది. మరోవైపు ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రైవేటు ఏజెంట్ల ప్రమేయం కూడా పలుమార్లు తనిఖీల్లో తెరపైకి వచ్చింది. తాజాగా బండ్లగూడ ఆర్టీఏలో నగదు వసూళ్ల ఆరోపణల వ్యవహారంతో ఆర్టీఓ, ఎంవీఐ, కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆరోపణలపై విచారణ కొనసాగుతోంది.

**చెక్‌పోస్టులకే తాళం**

2025లో రవాణా చెక్‌పోస్టులపై జరిగిన విస్తృత ఏసీబీ తనిఖీల్లో లెక్కల్లో లేని నగదు, ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం గుర్తించారు. అనంతరం ప్రభుత్వం 14 సరిహద్దు చెక్‌పోస్టులు, ఒక అంతర్గత చెక్‌పోస్టు కలిపి మొత్తం 15 కేంద్రాలను మూసివేసింది.

**ఆదాయం ఎంత?.. ఆస్తులెంత?**

ఫిట్‌నెస్, పర్మిట్లు, రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహన తనిఖీల్లో మధ్యవర్తుల ప్రమేయం ఎంత? తనిఖీల్లో లెక్కల్లో లేని నగదు ఎక్కడి నుంచి వస్తోంది? కీలక పోస్టుల్లో పనిచేసే అధికారుల ప్రకటిత ఆదాయానికి, ఆస్తులకు పొంతన ఉందా? నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో సంపద ఎలా సమకూరిందన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**స్పెషల్ డ్రైవ్‌తో బయటపడేదెంత?**

ఒకరిద్దరిపై నమోదైన కేసులను మొత్తం శాఖకు ఆపాదించలేం. ఆరోపణలు న్యాయ ప్రక్రియలో నిరూపితమవాల్సిందే. అయితే 2024 నుంచి వరుస ట్రాప్‌లు, ఆకస్మిక తనిఖీలు, ఏజెంట్ల వ్యవహారాలు, కోట్ల విలువైన ఆస్తుల కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఫిర్యాదులు, అనుమానాస్పద లావాదేవీలు ఉన్న అధికారులపై మరింత విస్తృత నిఘా అవసరమన్న వాదన బలపడుతోంది. ఆదాయం-ఆస్తులు, ఆర్థిక లావాదేవీలు, ఏజెంట్ల సంబంధాలపై ఏసీబీ రాష్ట్రవ్యాప్తంగా 'స్పెషల్ డ్రైవ్' చేపడితే అసలు లెక్క ఎంత తేలుతుంది? ఒక్కో కేసులోనే కోట్ల ఆస్తులు బయటపడుతున్న వేళ.. రవాణాశాఖను మరింత లోతుగా తవ్వితే ఇంకెన్ని అక్రమాస్తుల వ్యవహారాలు వెలుగుచూస్తాయన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

# మేయర్ అభ్యర్థిని ఓడగొడతా!

**(మొదటిపేజీ తరువాయి)**

అల్లుడా అనే సందేహం ప్రజల్లో కలుగుతోందని రంజిత్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే అల్లుడు అధికారులకు ఆదేశాలిస్తున్నారని ఆరోపించారు. నగరంలో భూకబ్జాలకు ప్రత్యేక టీమ్ పనిచేస్తోందంటూ ఆరోపించిన ఆయన, ఆధారాలు లేని విమర్శలు చేస్తే తాము కూడా ఆధారాలతో విషయాలు బయటపెడతామని హెచ్చరించారు.

**ఎంజీఎంకు వెళ్లి చూడండి**

ఎంజీఎం ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వాటిని తెలుసుకునేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని రంజిత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**విద్య-వైద్యం అందించే వారికే ఓటు**

ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించడం ప్రభుత్వాల బాధ్యతని రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే వారినే ఎన్నుకోవాలని కోరారు. పాలిటెక్నిక్, ఆయుష్ విద్యార్థుల సమస్యలపై తాము పోరాడామని చెప్పారు. నియోజకవర్గంలో 700 మందికి పైగా విద్యార్థుల చదువుకు తాను సహాయం చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్, వీపీ రెడ్డి, పులి విక్రమ్, మనోజ్, కరుణ్‌రావు, మడిశెట్టి వరుణ్, ఫిరోజ్, సునీల్, శ్యామ్, అభి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్‌లో చిన్నారులవి.. ప్రభుత్వ హత్యలే!

**ఐదుగురు పసికందుల మృతిపై కవిత ఆగ్రహం**

**దత్తత జిల్లాలో ఇంతటి విషాదం జరిగితే సీఎం రారా?**

**బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్**

**వైద్య వ్యవస్థపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ**

**నెల రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఆదిలాబాద్ ఘెరావ్**



ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (మన విశ్వం): రిమ్స్‌లో ఐదుగురు పసికందుల మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అగ్నిప్రమాదం జరిగిన ఎస్ఎన్‌సీయూను పరిశీలించిన ఆమె, చిన్నారుల మరణాలను 'ప్రభుత్వ హత్యలు'గా అభివర్ణించారు. బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**దత్తత జిల్లా.. సీఎం ఎక్కడ?**

ఆదిలాబాద్‌ను దత్తత తీసుకున్నట్లు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, ఐదుగురు పసికందులు మృతి చెందినా జిల్లాకు రారా అని కవిత ప్రశ్నించారు. రిమ్స్‌లో వైద్యులు, నర్సులు, శానిటేషన్, సాంకేతిక సిబ్బంది కొరత ఉందని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్, ఏసీ నిర్వహణపై సమగ్ర ఆడిట్ చేపట్టాలని డిమాండ్ చేశారు.

**ప్రత్యేక కమిటీ**

ఆదిలాబాద్ జిల్లాలో శిశు, గర్భిణుల మరణాలు, వైద్యసేవల పరిస్థితిపై అధ్యయనానికి తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని కవిత ప్రకటించారు. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు.

**నెల రోజుల గడువు**

ఆసుపత్రుల పెండింగ్ బిల్లులు చెల్లించి, ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే ఆదివాసీలతో కలిసి ఆదిలాబాద్‌ను ఘెరావ్ చేస్తామని కవిత హెచ్చరించారు.

# ఈ పాపం ఎవరిది.. సీఎం సాబ్?

**(మొదటిపేజీ తరువాయి)**

నిర్వహించినట్లు చెబుతున్నారు. దీంతో అసలు ప్రశ్నలు ఇప్పుడు నిర్వహణ వ్యవస్థ వైపే మళ్లుతున్నాయి. సమస్య వచ్చిన ఏసీ మరమ్మతు తర్వాత సురక్షితంగా ఉందని ఎవరు నిర్ధారించారు? సేఫ్టీ ఆడిట్లు జరిగితే ప్రమాదాన్ని ఎందుకు పసిగట్టలేకపోయారు? నవజాత శిశువుల ప్రాణాలతో ముడిపడిన ఎస్ఎన్‌సీయూలో విద్యుత్, అగ్నిమాపక వ్యవస్థల పర్యవేక్షణ ఎలా సాగింది? ఈ ప్రశ్నలకు విచారణలో స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది.

**విచారణకు సీఎం ఆదేశం**

ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రిమ్స్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. విచారణలో నిర్లక్ష్యం లేదా వైఫల్యం తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను బలోపేతం చేస్తామని తెలిపారు.

**సుమోటోగా తీసుకున్న హెచ్‌ఆర్సీ**

ఐదుగురు శిశువుల మరణాల ఘటనను తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, ఎస్ఎన్‌సీయూలో భద్రతా ఏర్పాట్లు, ప్రమాదం అనంతరం చేపట్టిన చర్యలపై అధికారుల నుంచి సమగ్ర నివేదిక కోరింది.

**ఐదు పసిప్రాణాలకు బాధ్యత ఎవరిది?**

విచారణలు జరుగుతాయి.. నివేదికలు వస్తాయి.. చర్యలు తీసుకుంటామనే హామీలూ వినిపిస్తాయి. కానీ ఐదు కుటుంబాలకు మిగిలింది మాత్రం తీరని కడుపుకోత. ముందే సమస్య తలెత్తిన ఏసీ విషయంలో తీసుకున్న జాగ్రత్తలేమిటి? సేఫ్టీ ఆడిట్లు జరిగినా ప్రమాదం ఎందుకు జరిగింది? వ్యవస్థలో ఎక్కడ వైఫల్యం జరిగింది? బాధ్యత ఎవరిది? ఐదు పసిప్రాణాలు బలైన ఈ విషాదంలో ఇప్పుడు కావాల్సింది ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానమే.

# రిమ్స్ విషాదం.. సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనం!

**పసికందుల మృతి తీవ్ర దిగ్భ్రాంతికరం**

**బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలి**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలు కఠినంగా అమలు చేయాలి**

**ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల**

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మన విశ్వం): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో పసికందుల మరణం అత్యంత విషాదకరమని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. అభం శుభం తెలియని చిన్నారుల ప్రాణాలు పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మృతుల తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**భద్రతపై నిర్లక్ష్యమెందుకు?**

రిమ్స్ ఘటన ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోందని ఈటల పేర్కొన్నారు. వరంగల్ ఎంజీఎంలో పైకప్పు కూలిన ఘటనను కూడా ప్రస్తావిస్తూ, వైద్యరంగంపై నిర్లక్ష్యానికి ఇటువంటి ఘటనలు నిదర్శనమని విమర్శించారు.

**దవాఖానలకు నిధులివ్వాలి**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తక్షణమే తగినన్ని నిధులు కేటాయించి మౌలిక వసతులను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేసి, రిమ్స్ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం తేలిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ డ్రామాలు పక్కనపెట్టి ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని ఈటల డిమాండ్ చేశారు.

# రిమ్స్ బాధితులకు రూ.25 లక్షలు ఇవ్వాలి

**చిన్నారుల కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు**

**వైద్య వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యమంటూ విమర్శ**

**చికిత్స పొందుతున్న చిన్నారులకు రూ.10 లక్షల సాయం చేయాలని డిమాండ్**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 23 (మన విశ్వం): ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎస్ఎన్‌సీయూ అగ్నిప్రమాదం అనంతరం బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నేతలు పరామర్శించారు. మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పార్టీ నాయకులు తుల ఉమ, బుక్యా జాన్సన్ నాయక్ తదితరులు రిమ్స్‌కు చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఐదుగురు చిన్నారుల మరణం తీవ్ర విషాదకరమని పేర్కొన్న నేతలు, ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ వైద్యరంగానికి ప్రాధాన్యం ఇచ్చి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసిందని, ప్రస్తుతం ఆసుపత్రుల నిర్వహణపై ప్రభుత్వం తగిన దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ప్రమాదం అనంతరం చికిత్స పొందుతున్న చిన్నారుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఘటనకు దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక
గురువారం, సెప్టెంబర్ 24, 2026


# తహశీల్దార్ భవనం.. అక్కడే నిర్మించాలి!

- కార్యాలయ తరలింపును వ్యతిరేకించిన అఖిలపక్షం
- ప్రస్తుత ప్రాంతంలోనే నిర్మించాలని వినతి

**మఠంపల్లి, సెప్టెంబర్ 23 (మన విశ్వం):** మఠంపల్లి మండల కేంద్రానికి మంజూరైన నూతన తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రస్తుతం కార్యాలయం ఉన్న ప్రాంతంలోనే నిర్మించాలని ఎమ్మార్పీఎస్ జేఏసీ, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కాంపాటి సందీప్ మాదిగ మాట్లాడుతూ.. నూతన భవనాన్ని దూర ప్రాంతంలోని ఇటుక బట్టీల వైపు నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్యాలయాన్ని



అక్కడికి తరలిస్తే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, కార్మికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో ఉన్న ప్రస్తుత ప్రాంతంలోనే కొత్త భవనం నిర్మించాలని కోరారు. ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా కార్యాలయాన్ని తరలిస్తే ఆందోళన చేపడతామని నాయకులు తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి ప్రస్తుత ప్రాంతంలోనే భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బచ్చలకూరి ప్రసాద్, జాల కిరణ్, బాలు నాయక్, నందిపాటి సోమయ్య, ఆరాల సైదులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# భోసి క్షేత్రంలో సంతాన ఫల మహోత్సవం: తరలివచ్చిన పొరుగు రాష్ట్ర భక్తులు

**ముధోల్(తానూర్), సెప్టెంబర్ 23(మన విశ్వం):** మండలంలోని ఆధ్యాత్మిక కేంద్రమైన భోసి గ్రామంలో వెలసిన కర్ర వరసిద్ధి వినాయక ఆలయం బుధవారం భక్తుల కోలాహలంతో పోటెత్తింది. ఏటా ఇక్కడ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సంతాన ఫల పూజా కార్యక్రమం ఈ ఏడాది కూడా కన్నులపండువగా జరిగింది. స్వామివారి కృపతో సంతాన ప్రాప్తి కలుగుతుందనే బలమైన నమ్మకంతో వేలాది మంది భక్తులు ఈ ఉత్సవంలో భాగస్వాములయ్యారు.

**ఉపవాస దీక్షలతో ప్రత్యేక పూజలు**

సంతానం లేని దంపతులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకుని ప్రత్యేక క్యూ లైన్లలో వేచి ఉన్నారు. స్వామివారికి ఇష్టమైన పూజా ద్రవ్యాలతో, భక్తిశ్రద్ధలతో ఉదయం నుంచి రాత్రి వరకు నిష్ఠగా ఉపవాస దీక్షలు ఆచరించారు. అనంతరం గర్భాలయంలోని కర వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ



క్రతువును జరిపించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి దీక్షలను విరమించారు.

**సరిహద్దులు దాటిన భక్తుల విశ్వాసం**

ఈ ఉత్సవానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నలుమూలల నుంచే కాకుండా, సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్ర లోని వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడం విశేషం. ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో భక్తులు రాకతో ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, నీడ సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తి సంకీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# రోడ్డు భద్రత.. అందరి బాధ్యత

- వర్ధన్నపేట బీసీ సంక్షేమ పాఠశాలలో ఆర్టీఏ అవగాహన
- మైనర్ల డ్రైవింగ్‌తో ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై వివరణ
- ప్రమాద బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రావాలని పిలుపు

**వర్ధన్నపేట, సెప్టెంబర్ 23 (మన విశ్వం):** రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు విలువైన ప్రాణాలను కాపాడవచ్చని ఆర్టీఏ అధికారులు తెలిపారు. వర్ధన్నపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ పాఠశాలలో ఆర్టీఏ హనుమకొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మధుకర్, శ్రావణ్, శ్రావ్య పాల్గొని ట్రాఫిక్ నిబంధనలు, సురక్షిత ప్రయాణంపై విద్యార్థులకు వివరించారు. 18 ఏళ్లలోపు పిల్లలు



మోటారు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన సందర్భాల్లో ప్రమాదాలతో పాటు వాహన యజమానులు, తల్లిదండ్రులు చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో బాధితులకు సహాయం అందిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం పెరుగుతుందని వివరించారు. గుడ్ సమారిటన్‌గా ప్రమాద బాధితులకు సాయం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ద్విచక్ర వాహనంపై హెల్మెట్, కారులో సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని, అతివేగం, డ్రైవింగ్ సమయ ంలో మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించాలని సూచించారు. విద్యార్థులు రోడ్డు భద్రతపై తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లోనూ అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల పంట నిల్వకు.. రూ.7 కోట్ల భరోసా

- తాడ్వాయిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాము
- ఆరు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలి: మంత్రి సీతక్క
- గిరిజన ఆవాసాల్లో సీసీ రోడ్లకు రూ.50 కోట్లు
- మారుమూల గూడాల్లో సౌర విద్యుత్‌తో వెలుగులు

**ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23(మన విశ్వం):** రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు సురక్షిత నిల్వ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం గోదాముల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.7 కోట్లతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్య గోదాముకు ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ నిల్వ వసతులు లేక రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టాల్సి వస్తోందని, అకాల వర్షాలతో పంట తడిసి నష్టపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా తాడ్వాయిలో భారీ గోదాము నిర్మిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో మరో గోదాము నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగంగా చేపట్టి ఆరు నెలల్లో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తేవాలని గిడ్డంగుల సంస్థ అధికారులు, గుత్తేదారులను



ఆదేశించారు. వచ్చే వర్షాకాలానికి ముందే పనులు పూర్తికావాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. గిరిజన ఆవాసాల్లో సిమెంట్ కాంక్రీటు రహదారుల నిర్మాణానికి సుమారు రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. విద్యుత్ సౌకర్యం లేని మారుమూల గూడాల్లో సౌర విద్యుత్‌తో ఇంటింటికీ వెలుగులు, తాగునీటి సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పది రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. మహిళా సంఘాలు ముందుకొస్తే ఐదు నుంచి పది ఎకరాల్లో సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు సహకరిస్తామని, వాటి ద్వారా సంఘాలకు ఆదాయం సమకూరేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీల వారీగా రూ.50 లక్షల విలువైన ప్రజోపయోగ పనులు చేపట్టే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ సోమయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నిర్మల్ ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్‌గా డీఆర్వో రాథోడ్ రమేశ్

- కలెక్టరేట్‌లో అధికారికంగా బాధ్యతల స్వీకరణ
- పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

**ముధోల్ (నిర్మల్ కలెక్టరేట్), సెప్టెంబరు 23 (మన విశ్వం):** నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) రాథోడ్ రమేష్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిపాలనలోని పలు కీలక అంశాలు, రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ



కార్యక్రమాల పురోగతిపై అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ విష్ణువర్ధన్, సివిల్ సప్లై డీఎస్ఓ రాజేందర్, డీఎం సుధాకర్, ఏడీ ప్రవీణ్, పలువురు రెవెన్యూ అధికారులు మరియు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన పట్టాదారులు తప్పనిసరిగా రైతు నమోదు చేసుకోవాలి: మండల వ్యవసాయ అధికారి సారిక

**ముధోల్(కుబీర్), సెప్టెంబర్ 23(మన విశ్వం):** కుబీర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నూతనంగా పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులందరూ ప్రభుత్వం నుంచి అందే సేవలు, రాయితీలను పొందేందుకు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ (రైతు నమోదు) ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి (ఏఓ) సారిక ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 01-01-2026 నుండి 13-08-2026 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు అందుకున్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని



కోరారు. అర్హులైన రైతులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే తమ పరిధిలోని గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని (ఏఈఓ) సంప్రదించి, తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ రైతు నమోదు ప్రక్రియ పూర్తయిన వారికి మాత్రమే ప్రభుత్వ వ్యవసాయ సేవలు, విత్తనాలు, ఎరువులపై లభించే సబ్సిడీలు మరియు వివిధ రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందని ఆమె స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకోని పక్షంలో ప్రభుత్వ ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని, కాబట్టి గడువు లోగా రైతులందరూ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని ఏఓ సారిక పిలుపునిచ్చారు.

# అంబేడ్కర్ భవనంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయండి


- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కుచాడి శ్రీహరి రావు వినతి
- వసతుల కల్పనకు రూ. 30 లక్షల నిధుల మంజూరుపై హామీ

**ముధోల్(నిర్మల్ టౌన్), సెప్టెంబర్ 23(మన విశ్వం):** నిర్మల్ పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రత్యేకంగా ఒక 'స్టడీ సర్కిల్' ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కుచాడి శ్రీహరిరావు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని నివాసంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను శ్రీహరి రావు ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా భవనం ప్రస్తుత పరిస్థితిని మంత్రికి వివరించి, వసతుల కల్పనకై ఒక



వినతి పత్రాన్ని అందజేశారు. భవనం లోపల ప్రతిధ్వని (ఎకో) నివారణ చర్యలు చేపట్టాలని, విచ్చేసే అతిథుల సౌకర్యార్థం కుర్చీలు, ఇతరత్రా అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్టడీ సర్కిల్ ఏర్పాటుకు నిధులు ఇవ్వాలని ఆ వినతి పత్రంలో వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, భవన ఆధునికీకరణకు అవసరమైన రూ.30 లక్షల నిధులను వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీహరి రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు కొంతం మురళీధర్, మధుకర్, అనిల్ తదితరులు ఉన్నారు.

# వరి కొనుగోళ్లు చురుగ్గా సాగాలి: అధికారులకు వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఆదేశం..



**ముధోల్(నిర్మల్), సెప్టెంబర్ 23 (మన విశ్వం):** రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని జిల్లాల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ వంటి కీలక అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి ఆయన సమగ్రంగా సమీక్షించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు వీలుగా జిల్లాల్లో తగినన్ని లారీలు, టార్పాలిన్లు, గన్నీ సంచులు, హమాలీలతో పాటు అవసరమైన అన్ని రకాల సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# శాస్త్రీయ నృత్యాలతో అలరించిన చిన్నారులు

**- వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఆకట్టుకున్న ప్రదర్శనలు**

**- కూచిపూడి, భరతనాట్యంతో భక్తులను మెప్పించిన సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ**



**కుత్బుల్లాపూర్/బాచుపల్లి , సెప్టెంబర్ 23(మన విశ్వం):** క్రాంతినగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. తొమ్మిదో రోజు వేడుకల్లో భాగంగా సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ చిన్నారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో అలరించారు.వినాయకుడి స్తుతి, అమ్మవారి కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల హావభావాలు, నృత్య విన్యాసాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది.చిన్న వయస్సు నుంచే పిల్లల్లో భారతీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలపై ఆసక్తి పెంపొందించడమే తమ లక్ష్యమని అకాడమీ గురువులు తెలిపారు. శాస్త్రీయ నృత్యంతో ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో క్రాంతినగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, భక్తులు, చిన్నారుల తల్లిదండ్రులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేశ్ వేడుకల్లో మత సామరస్యం: భక్తులకు ప్రసాద పంపిణీ చేసిన ఉప సర్పంచ్ ఫరూక్



**ముధోల్ (తానూర్), సెప్టెంబరు 23(మన విశ్వం):** మండల కేంద్రంలో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మత సామరస్యానికి అద్దంపట్టే అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది.తానూర్ ఉప సర్పంచ్ ఫరూక్ ఆధ్వర్యంలో స్థానిక వినాయక మండపం వద్ద భక్తులకు, చిన్నారులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ..సమాజంలో హిందూ, ముస్లిం అనే భేదభావం లేకుండా అందరూ సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలన్నారు. పండగలు, ఉత్సవాలు మానవ సంబంధాలను, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై సదా ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, భక్తులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అబ్దుల్లాపూర్ మోక్ష కర్ర గణపతిని దర్శించుకున్న జోహార్ పూర్ గ్రామ సర్పంచ్ గైని దయానంద్



**ముధోల్(లోకేశ్వరం), సెప్టెంబర్ 23(మన విశ్వం):** మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అబ్దుల్లాపూర్ గ్రామ మోక్ష కర్ర గణపతిని జోహార్ పూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గైని దయానంద్ బుధవారం నాడు తన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకున్న సర్పంచ్ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేకపూజలు, నిర్వహించి .ఈ సందర్భంగా సర్పంచ్ గైని దయానంద్ మాట్లాడుతూ... పర్యావరణ హితంగా, ఒకే ఊరు-ఒకే గణపతి అనే ఐక్యతతో దశాబ్దాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్న అబ్దుల్లాపూర్ గ్రామస్తుల భక్తిశ్రద్ధలు అభినందనీయమన్నారు. ఈ వినాయక నవరాత్రుల వేళ మోక్ష కర్ర గణపతి ఆశీస్సులతో జోహార్ పూర్ మరియు అబ్దుల్లాపూర్ గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని మొక్కులు తీర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, లఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నార.

# రైతులందరూ 'ఫార్మర్ ఐడీ' చేసుకోవాలి: తరోడా క్లస్టర్ ఏఈఓ భూమేష్



**ముధోల్,సెప్టెంబర్ 23(మన విశ్వం):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అగ్రి స్టాక్' రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) ప్రక్రియను తరోడా క్లస్టర్ పరిధిలోని రైతులందరూ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) భూమేష్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల సెప్టెంబర్ 22 నుండి 30 వరకు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఏఈఓ భూమేష్ మాట్లాడుతూ, భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, సేవలు పొందడానికి ఈ డిజిటల్ గుర్తింపు కార్డు ఎంతో కీలకమన్నారు.

**ఫార్మర్ ఐడీతో కలిగే ప్రయోజనాలు**

వరి, పత్తి, మొక్కజొన్న, కంది వంటి పంటల కనీస మద్దతు ధర (మ్రా) కొనుగోళ్లకు ఇది తప్పనిసరి.బ్యాంకుల ద్వారా సులభంగా పంట రుణాలు పొందవచ్చు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలు, సంక్షేమ పథకాలు నేరుగా అందుతాయి.ఎఫ్ఎఫ్ఎస్ (ఖీఖీా) యాప్ ద్వారా ఎరువుల కొనుగోళ్లకు వీలుంటుంది.కావలసిన పత్రాలు:రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, మరియు ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్‌తో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ని గానీ లేదా మీ సేవ కేంద్రాన్ని గానీ సంప్రదించాలని సూచించారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులు, తమ ఆధార్ నెంబర్ నమోదు చేసి 'రైతు ఐడీ నెంబర్' డౌన్లోడ్ చేసుకోవచ్చని ఏఈఓ భూమేష్ స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని క్లస్టర్ పరిధిలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కలగాలి

**- కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్**

**- ఎంపేడులో వినాయకుని లడ్డూను రూ.29,516లకు దక్కించుకున్న కోటగిరి స్వర్ణలత--సతీష్ దంపతులు**



**టేకుమట్ల.సెప్టెంబర్ 23 (మన విశ్వం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఎంపేడు గ్రామంలో శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోశమ్మ గుడి వద్ద ఘనంగా నిర్వహించిన వినాయకుని లడ్డూ వేలంపాటలో గ్రామానికి చెందిన కోటగిరి స్వర్ణలత--సతీష్ గౌడ్ దంపతులు రూ.29,516లకు గణపతి ప్రసాదమైన లడ్డూను కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా కోటగిరి సతీష్ గౌడ్ మాట్లాడుతూ, విఘ్నేశ్వర స్వామి దివ్య ఆశీస్సులతో ఎంపేడు గ్రామ ప్రజలతో పాటు మండల ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో, పిల్లాపాపలతో సుఖశాంతులతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, వర్తమాన ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క అర్హుడైన లబ్ధిదారునికి అందేలా భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు.ప్రజాక్షేత్రంలో నిరంతరం ఉంటూ మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భారీ మెజారిటీతో గెలుపొంది, ప్రజా ప్రభుత్వంలో మంత్రి పదవిని చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ వేలంపాట,వినాయక ఉత్సవ కార్యక్రమంలో శ్రీ విఘ్నేశ్వర యూత్ సభ్యులు,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిమజ్జనానికి వేళాయె!.. ఉప్పల్‌లో గణనాథులకు వీడ్కోలు

**భక్తిశ్రద్ధలతో సాగిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు**

**డప్పు చప్పుళ్లు.. భజనల నడుమ నిమజ్జనానికి తరలుతున్న విగ్రహాలు**

**ట్రాఫిక్, భద్రతపై పోలీసుల ప్రత్యేక నిఘా**



**గ్రేటర్ హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మన విశ్వం):** తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథులకు వీడ్కోలు పలికే వేళ వచ్చింది. ఉప్పల్ పరిధిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగాయి. మండపాల్లో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, నైవేద్యాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భజనలు, భక్తిగీతాలతో ఆయా ప్రాంతాలు గణపతి నామస్మరణతో మార్మోగాయి.నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో బుధవారం పలు మండపాల నుంచి గణేశ్ విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. డప్పు చప్పుళ్లు, భక్తుల నృత్యాలు, గణపతి బప్పా మోరియా నినాదాల మధ్య శోభాయాత్రలు సందడిగా సాగాయి. నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు.నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రధాన మార్గాలను పర్యవేక్షిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. పోలీసులతో పాటు మున్సిపల్, విద్యుత్ శాఖ సిబ్బంది నిమజ్జన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శోభాయాత్రలు ప్రశాంతంగా జరిగేందుకు మండపాల నిర్వాహకులు సహకరించాలని అధికారులు సూచించారు.

# గణనాథుడికి ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్న ప్రసాదం

**అన్న ప్రసాద వితరణలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 23(మన విశ్వం ):** ఎల్లారెడ్డిపట్టణ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గజేంద్ర సేన గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, వైస్ చైర్మన్ మత్తామాల భాగ్యవతి, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులను గణేష్ మండలి సభ్యులు శాలువాలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇలేగాంలో నేడు గణేష్ నిమజ్జనం, సార్వజనిక్ మహా అన్నదానం

**గ్రామ పంచాయతీ పాలకవర్గం, విడిసి సభ్యుల వెల్లడి**

**ముధోల్(భైంసా రూరల్), సెప్టెంబర్ 23(మన విశ్వం):** భైంసా మండలం ఇలేగాం గ్రామంలో కొలువైన వినాయక విగ్రహ నిమజ్జన వేడుకలు, సార్వజనిక్ మహా అన్నదాన కార్యక్రమాన్ని గురువారం (నేడు) వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ విడిసి (గ్రామ అభివృద్ధి కమిటీ) సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.గత 10 రోజులుగా భక్తుల పూజలందుకున్న లంబోదరుడికి నేటి ఉదయం ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 10 గంటల నుండి భక్తులందరికీ భారీ ఎత్తున సార్వజనిక్ మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభం కానుందని పేర్కొన్నారు.సాయంత్రం వేళ మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, భక్తుల కోలాటాల నడుమ గణనాథుడి శోభాయాత్ర (ఊరేగింపు) ప్రారంభం కానుంది. గ్రామంలోని ముఖ్య వీధుల గుండా సాగే ఈ నిమజ్జన మహోత్సవంలో సర్పంచ్ సీరం రాజమణి శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, విడిసి చైర్మన్ కే. రత్నాకర్, క్యాషియర్ కే. కృష్ణమూర్తి, విడిసి సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# త్రివర్ణ గణేశుని శోభాయాత్ర వైభవం

**- గుస్సాడి నృత్యాలతో మార్మోగిన కాగజ్‌నగర్**

**- ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**





**కొమరం భీమ్, సెప్టెంబర్ 23(మన విశ్వం):** కాగజ్‌నగర్ పట్టణంలో త్రివర్ణ గణేశుని శోభాయాత్ర భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు, స్థానికులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని మార్కెట్ ఏరియా, రాజీవ్‌గాంధీ చౌరస్తా మీదుగా శోభాయాత్ర కోలాహలంగా సాగింది. దారిపొడవునా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ గుస్సాడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తుల గణపతి నామస్మరణతో పట్టణ వీధులు మార్మోగాయి. ప్రజలు, కార్యకర్తల భాగస్వామ్యంతో శోభాయాత్ర ఘనంగా ముగిసింది.


# ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో: రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

**హైదరాబాద్ :** రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్ కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురకసింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్ రాష్ట్రంలో నిరంతరాయ ంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు.

"కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.




# భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్



**హైదరాబాద్ :** భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

# ఇది ముమ్మాటికి జూరాల రైతుల విజయం



**జూరాల :** జూరాల ఆయకట్టుకు సాగునీటి కోసం రైతులు చేసిన పోరాటం ఫలించిందని మాజీ మంత్రి డా.సి. లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎనిమిది రోజుల రైతుల ఆందోళనలకు ప్రభుత్వం తలొగ్గిందని ఇది ముమ్మాటికి రైతుల విజయమన్నారు. ప్రాజెక్టులో నీళ్లు ఉన్నప్పటికి రైతులను కాంగ్రెస్ సర్కార్ అనవసరంగా గందరగోళానికి గురిచేసిందన్నారు. సడన్‌గా నీటి విడుదల బంద్ చేయడంతో పంటలు ఎండిపోతాయనే భయం రైతులను వెంటాడిందన్నారు.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల జూరాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీళ్లు విడుదల చేసిందని వానాకాలం సాగు పూర్తి అయ్యే వరకు నీళ్లు విడుదల చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాజకీయాలతీతంగా రైతులకు మద్దతుగా నిలుస్తుందని అందుకే నిన్న ధర్నాకు పిలుపునిచ్చిందన్నారు. కృష్ణా నదిలో వరద ప్రారంభమైనపుడు కూడా బీఆర్ఎస్ ధర్నా పిలుపుతోనే రైతులకు సాగునీరు వచ్చిందని లక్ష్మారెడ్డి గుర్తు చేశారు.

# ఆదిలాబాద్ రిమ్స్ పిల్లల వార్డులో ఏసీ పేలిన ఘటన - ఐదుకు చేరిన మృతుల సంఖ్య

**ఆదిలాబాద్:** రిమ్స్ ఆసుపత్రిలో పిల్లలవార్డులోని నియోనాటల్ స్పెషల్ కేర్ యూనిట్- ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపిన విషయం తెలిసిందే. తాజాగా ఈ ఘటనలో మృతిచెందిన చిన్నారుల సంఖ్య ఐదుకు చేరింది. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్‌కు చెందిన దుర్గబాయి బిడ్డ రిమ్స్‌లో మృతి చెందారు. ఇంద్రవెల్లి మండలం దుబ్బ గూడకు చెందిన నాగుబాయి బిడ్డను నిర్మల్‌కు తరలిస్తుండగా మృత్యువాత పడ్డారు.

సోమవారం అర్ధరాత్రి రిమ్స్? ఆస్పత్రిలో ా-ూజ పేలి దట్టంగా పొగ అలముకుంది. ఆ సమయంలో ఇంక్యూబెటర్లలో 27 మంది పసికందులు చికిత్స పొందుతుండగా, పొగ కారణంగా వారికి ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్యాధికారులు, అద్దాలను పగలగొట్టి పసికందులను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఇచ్చోడకు చెందిన సలీం ఐదురోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మరో చిన్నారి కూడా ప్రాణాలు విడిచింది. పరిస్థితి విషమంగా ఉన్న 20 రోజుల చిన్నారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ చిన్నారి మృతి చెందింది. తాజాగా మృతిచెందిన పసికందుల సంఖ్య ఐదుకు చేరింది. ఏసీ పేలి కలకలంఅర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా ఏసీ పేలిపోవటం కలకలం సృష్టించింది. ఈ ఘటనతో ఉలిక్కిపడిన సిబ్బంది హాహాకారాలతో భయానక వాతావరణం నెలకొంది. ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో రౌండ్స్‌కు వచ్చిన డైరెక్టర్ జైసింగ్ విషయం తెలుసుకొని సిబ్బంది సహా అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి ఎన్ఎ న్‌సీయూ వెళ్లగా ఊపిరి ఆడనీయకుండా దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటన గురించి తెలుసుకున్న కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను ఓదార్చే ప్రయత్నం చేశారు. "నేను ఒక పేషెంట్?ను చూడటానికి వచ్చాను. ఆస్పత్రి డైరెక్టర్?తో మాట్లాడుతున్న క్రమంలో ఒక నర్సు వచ్చి బ్లాస్ట్? అయ్యి పొగ వస్తుందని చెప్పడంతో అందరం లోపలికి వెళ్లాం. అప్పటికే నల్లటి పొగ కమ్ముకుంది. మొత్తం చీకటిగా ఉంది. కరెంటు కూడా లేదు. కొంతమంది పసిపిల్లలను బయటకు తీసుకొచ్చాం. పొగ కారణంగా మా దుస్తులు మొత్తం నల్లగా అయ్యాయి" - సంతోశ్?, ప్రత్యక్ష సాక్షి, ఆదిలాబాద్‌ఘటనపై విచారణకు సీఎం ఆదేశంఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న మిగిలిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని ఆదేశించారు. పలువురు మంత్రులు సైతం రిమ్స్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఆసుపత్రిని పరిశీలించిన మంత్రి దామోదర ప్రమాదం దృష్ట్యా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. ముగ్గురు చిన్నారుల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై కమిటీ వేశామన్న మంత్రి, నివేదిక వచ్చిన అనంతరం కార్యాచరణ చేపడతామన్నారు.



# హీరో నాని వినతిపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి - స్థానికంగా దరఖాస్తు చేసుకోవాలని సూచన

**హైదరాబాద్:** హీరో నాని వినతిపై ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి స్పందించారు. భద్రతా మార్గదర్శకాలను గౌరవిస్తున్నందుకు నానికి అభినందనలు తెలిపారు. ప్రతిభావంతుడైన తెలంగాణ యువ దర్శకుడు శ్రీకాంత్ తీసిన చిత్రం పట్ల మీ నిబద్ధతను అభినందిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. ప్రీమియర్? షో చూసేందుకు అనుమతి కోసం స్థానిక పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సీఎం సూచించారు. దానిని పరిశీలించి అక్కడి పోలీసులే నిర్ణయం తీసుకుంటారని నానికి ఎక్స్? వేదికగా సీఎం తెలిపారు. అసలు ఏం జరిగిందంటే? హైదరాబాద్?లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్యా థియేటర్?లో తన సినిమా 'ది ప్యారడైజ్' ప్రీమియర్ షో చూసేందుకు అనుమతి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి నటుడు నాని మంగళవారం ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రీమియర్ షో కోసం థియేటర్‌కు వెళ్లాలనుకుంటు న్నట్లు తెలిపిన నాని ప్రేక్షకులతో కలిసి సినిమాను ఆస్వాదించాలని ఆశపడుతున్నట్లు తెలిపారు. ప్రేక్షకుల స్పందనను ప్రత్యక్షంగా చూస్తేనే నటుడిగా తనకు తృప్తి అని, అన్ని నిబంధనలు, భద్రతా చర్యలను పాటిస్తానని స్పష్టం చేశారు. తన అభ్యర్థనను సీఎం, సినిమాటోగ్రఫీ మంత్రి పరిశీలిస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. "సినిమాను అమితంగా ప్రేమించే ఒక అభిమానిగా, మరీ ముఖ్యంగా చిన్నప్పటి నుంచే సినిమాను అత్యుత్తమ స్థాయిలో ఆస్వాదించిన వ్యక్తిగా నేను ఈ విన్నపం చేస్తున్నాను. నాకు సినిమా అంటే, నాలాగే సినిమాను ప్రేమించేవారితో కలిసి చూడటమే. హైదరాబాద్‌లో ఆ అనుభూతికి 'హైదరాబాద్?లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. 'ది ప్యారడైజ్' సినిమా ప్రీమియర్ షో (సెప్టెంబర్ 23) కోసం ఆర్టీసీ క్రాస్ రోడ్స్?లోని థియేటర్‌ను సందర్శించి, మేము ఎవరి కోసం అయితే ఈ సినిమాను రూపొందించామో, ఆ ప్రేక్షకుల మధ్య కూర్చుని సినిమాను ఆస్వాదించాలని నేను కోరుకుంటున్నాను.

ప్రేక్షకుల మధ్య కూర్చుని, సినిమా పట్ల వారి స్పందనను ప్రత్యక్షంగా అనుభవించడమే ఒక సినిమాను రూపొందించడంలో లభించే అత్యున్నత సంతృప్తి అని నేను నమ్ముతాను. అమలులో ఉన్న అన్ని ప్రోటోకాల్స్, భద్రతా మార్గదర్శ కాలను మేము ఖచ్చితంగా పాటిస్తాము. అదే మాకు అత్యంత ప్రాధాన్యతాంశం. నా విన్నపాన్ని మీరు సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాను" - నటుడు నాని ట్వీట్నటుడు అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2: ది రూల్' సినిమా స్పెషల్ ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో సంధ్యా థియేటర్ వద్ద ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన చోటు చేసుకుంది. ఆ ఘటన తర్వాత ఏ నటుడు కూడా ప్రీమియర్ షోకు హాజరుకాలేదు. ఈ తరుణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుందుకు రేవంత్ రెడ్డిని 'ది ప్యారడైజ్' ప్రీమియర్ షో చూసేందుకు నాని అనుమతి కోరినట్లు తెలుస్తోంది.



# 'మొక్కలే మానవాళికి జీవనాధారం'



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 23 :** మొక్కలే మానవ మనుగడకు జీవనాధారమని బూర్గంపహాడ్ మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ బానోత్ సరోజ అన్నారు. బుధవారం గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హరితదినం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉప సర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ రహిత గ్రామం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మనం నాటే మొక్క నేడు వృక్షంగా మారి స్వచ్ఛమైన ఆక్సిజన్‌తో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ ప్లాస్టిక్కు నిషేధించాలని, ప్లాస్టిక్ కారణంగా పచ్చదనానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుందని ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, ఉపసర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వార్డుమెంబర్ అవినీటి నర్సయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అప్రకటిత విద్యుత్ కోతలపై రైతుల ధర్నా.. సబ్‌స్టేషన్ ముట్టడి

**మహబూబ్ నగర్ :** అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం నాచహల్లి క్రిష్ణగిరి, పెద్దగూడెం తండా, సవాయిగూడెం గ్రామాలకు చెందిన రైతులు శనివారం సబ్‌స్టేషన్ సమీపంలో ఆందోళనకు దిగారు. వనపర్తి--పెబ్బేరు ప్రధాన రహదారిపై బైఠాయించి విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే డీఈతో మాట్లాడించాలని రైతులు పట్టుబట్టారు. రైతులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు 13 గంటల పాటు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. . చేశారు. ఈ ఆందోళనలో రైతులతో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కే మాణిక్యం, సింగిల్ విండో అధ్యక్షులు రఘువరన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ధర్మనాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ డేగ మహేష్ రెడ్డి, నాయకులు రవి ప్రకాష్ రెడ్డి, నారాయణ నాయక్, శంకర్ నాయక్, టికె నాయక్, సర్పంచ్ పద్మ వెంకటయ్య, మాజీ సర్పంచ్ బాలకృష్ణ, మహేష్, అంజి, రూప్ల నాయక్, గోవిందు నాయక్,శివ,ఆనంద్, తులసి రామకృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు .

# కూకట్‌పల్లి--వేవ్‌రాక్ మధ్య బస్ ట్రయల్ రన్

**- ట్రాఫిక్ రద్దీ తగ్గించడమే లక్ష్యం**

**- ఆర్టీసీ, ఐటీ కంపెనీల బస్సులకు ప్రత్యేక లేన్‌పై పరిశీలన**

**- తక్కువ స్టాప్‌లతో వేగవంతమైన బస్సు సర్వీసులపై కసరత్తు**

**గ్రేటర్ హైదరాబాద్, సెప్టెంబర్ 23 (మన విశ్వం):**
కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ నుంచి వేవ్‌రాక్ వరకు ట్రాఫిక్ రద్దీని తగ్గించి బస్సుల రాకపోకలను వేగవంతం చేసే దిశగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. టీజీఎస్‌ఆర్టీసీతో పాటు ఐటీ కంపెనీల బస్సులకు ప్రత్యేక లేన్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తూ ట్రయల్ రన్ నిర్వహించారు. రవాణా శాఖ, టీజీఎస్‌ఆర్టీసీతో గతంలో జరిగిన చర్చల కొనసాగింపుగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఈ ప్రయోగాన్ని చేపట్టారు. రహదారి సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ రద్దీ, బస్సుల రాకపోకలు, ప్రత్యేక బస్ లేన్ సాధ్యాసాధ్యాలను అధికారులు, నగర ప్రణాళిక నిపుణులు పరిశీలించారు. ప్రయాణికులు ఐటీ కారిడార్‌కు త్వరగా చేరుకునేలా తక్కువ స్టాప్‌లతో ప్రత్యేక బస్సులు నడిపే అంశం పైనా దృష్టి సారించారు. ముఖ్యంగా బయోడైవర్సిటీ కారిడార్‌లో ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడం, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. ట్రయల్ రన్‌లో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రి రెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ ఈడీ శ్రీధర్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## రైలుపైకి ఎక్కి హైటెన్షన్ వైర్‌ను పట్టుకునేందుకు యత్నం.. రేణిగుంటలో ఉత్కంఠ



**తిరుపతి,** తిరుపతిలోని రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి హల్ చల్ చేశాడు. రైలు పైకి ఎక్కి హైటెన్షన్ విద్యుత్ వైర్‌ను పట్టుకునేందుకు యత్నించడం తీవ్ర కలకలం రేపింది. సదరు వ్యక్తి తిరువనంతపురం – న్యూఢిల్లీ కేరళ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి దిగి.. ప్లాట్‌ఫాంపై కేకలు వేస్తూ రైలు పైకి ఎక్కాడు. అక్కడ హైటెన్షన్ విద్యుత్ వైర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా. ప్రమాదాన్ని గమనించిన వెంటనే రైల్వే అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆపై ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, ఫైర్ సిబ్బంది గంటపాటు శ్రమించి అతడిని సురక్షితంగా కిందకు దించడంతో పెను ప్రమాదం తప్పింది.అయితే విద్యుత్ సరఫరా నిలిపివేతతో కొద్దిసేపు రైళ్ల రవాణా నిలిచిపోయింది. 'నన్ను అరెస్ట్ చేస్తే 48 గంటల్లో కోర్టులో హాజరుపరచాలి', 'త్రీ స్టార్ ఆఫీసర్ మాత్రమే రావాలి' అంటూ నిందితుడు హల్‌చల్ చేశాడు. వ్యక్తికి మతిస్థిమితం లేదా లేక మద్యం మత్తులో ఉన్నాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనతో రేణిగుంట రైల్వే స్టేషన్‌లో కొద్దిసేపు ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

# అక్టోబర్‌లో స్థానిక ఎన్నికలు.. కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం: మంత్రి లోకేశ్

**అమరావతి, సెప్టెంబర్ 23:** స్థానిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈరోజు మంత్రులతో లోకేశ్ బ్రేక్‌ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలకు అంతా సిద్ధమవ్వాలని.. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలన్నారు. అక్టోబర్‌లో ఎన్నికలు జరుగుతాయని.. స్థానిక ఎన్నికలు జరగవనే అపోహలు ఎవరికీ వద్దని తెలిపారు. కోర్టు పెండింగులో ఉన్నవి కూడా త్వరితగతిన పరిష్కరించుకుని అన్నింటిలో ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఎన్నికలు వాయిదా పడాలన్న గొడ్డలి పార్టీ కుయుక్తులు పని చేయవన్నారు. పొత్తుల అంశంపై సమన్వయ కమిటీ, అధిష్ఠానం చర్చించి



నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.ఓర్వలేకే డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు.విద్యా శాఖను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రల పట్ల తనతోపాటు సంబంధిత మంత్రులూ అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ సూచించారు. గురువులపై గూండాలతో దాడులు చేయించే దుశ్చర్యకు గొడ్డలిపార్టీ పాల్పడిందని మండిపడ్డారు. శాప్ కార్యాలయం వద్దకు వచ్చి దాడులకు తెగపడి మీసాలు మెలేసినవారు.. పోలీసులు చట్టప్రకారం కేసులు పెట్టగానే పరారీలో ఉన్నారన్నారు. టీచర్లను కించపరుస్తూ ఎవరైనా దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అధికారంలో ఉండి చేసిన అక్రమాలపై ఆధారాలతో ఒక్కో కుంభకోణం బయటకు వస్తుంటే, ఓర్వలేకే డైవర్ట్ రాజకీయాల కోసం నిరుద్యోగులకు మేలు చేసిన డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వర్షాలపై..రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడుతుండటం శుభపరిణామమని లోకేశ్ అన్నారు. వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులకు సూచించారు. జలాశయాలు నింపుకునేందుకు ఇదో మంచి అవకాశమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# నీళ్లొదిలి మూడు వారాలైనా – వెలిగొండ నిర్వాసితుల్లో పునరావాస వెలితి

**వెలిగొండ:** ప్రాజెక్టు నుంచి నీరు వదిలి నల్లమలసాగర్ జలాశయం నింపుతున్నారు. తడారిన బీళ్లకు సాగునీళ్లొస్తున్నాయని రైతులు, గొంతెండిన ఊళ్లకు మంచినీళ్లు వస్తున్నాయని ప్రజలూ ఖుషీగా ఉన్నారు. మరి ఆ జల యజ్ఞాన్ని సాకారం చేయడానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసితులు ఆనందంగా ఉన్నారా? పునరావాస ప్యాకేజీ దక్కినవారి సంగతి సరే! దక్కని వారి మాటేంటి? ఎందుకంటే ఇప్పటికీ నిర్వాసిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో పునరావాసం అమలు చేయలేదు.1000కి పైగా కుటుంబాలకు ప్యాకేజీ దక్కలేదు. వారికి ఇంటి స్థలాలు చూపలేదు. గెజిట్‌లో పేర్లు లేక ఆందోళన చెందుతున్న వారిలో అర్హులను తేల్చి, ప్యాకేజీ అందించే ప్రక్రియ పూర్తికాలేదు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు పరిధిలో మొత్తం 11 ఊళ్లలో 7321 కుటుంబాలు నివాసాలు కోల్పోయాని గుర్తించారు. ఈ మేరకు గతంలోనే గెజిట్



ప్రకటించారు. ఆగస్ట్ 31న నీరు విడుదల చేసే ముందు 6158 కుటుంబాలకు రూ.758.31 కోట్ల పునరావాస ప్యాకేజీ చెల్లించారు. నీరు వదులుతున్నారని మిగిలిన కుటుంబాలు గ్రామాలు ఖాళీ చేసి వెళ్లిపోయాయి. వాటిలో 1163 కుటుంబాలకు ప్యాకేజీ దక్కలేదు. నిజానికి ప్యాకేజీ అందించాకే వారిని ఖాళీ చేయించాల్సి ఉంది.ఇక 439 కుటుంబాల కోసం రూ.54.91 కోట్ల విలువైన బిల్లులు అప్‌లోడ్ చేసినట్లు మార్కాపురం జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. ఇంకో 349 కుటుంబాలకు చెందిన బిల్లులు సీఎంఎఫ్‌ఎస్‌లో అప్‌లోడ్ అవుతున్నాయి. 185 కుటుంబాలకు సంబంధించి ఇప్పటికీ అవార్డు పాస్ కాలేదు. ఇక 172 కుటుంబాలకు పరిహారం పొందే అర్హత లేదని అధికారులు తేల్చారు. కోర్టు కేసులు, వివాదాలు పెండింగ్‌లో ఉన్నందున 18 కుటుంబాలకు పునరావాస ప్యాకేజీ చెల్లించలేదు.ఇళ్ల నిర్మాణమే కీలకం : పునరావాసంలో ఇళ్ల నిర్మాణమే కీలకం. ఇంటి స్థలం చూపించి, నిర్మాణ ఖర్చులు చెల్లిస్తే తామే ఇళ్లు కట్టుకుంటామని 3962 కుటుంబాలు అంగీకారం తెలిపాయి. ఈ ఆప్షన్ ఎంచుకున్న వారికి పట్టాలు అందించినా, సుంకేశుల గ్రామ నిర్వాసితులకే ఎవరి స్థలాలు ఎక్కడో చూపించారు. తోకపల్లి, గోగులదిన్నె, ఇందుట్ల కాలనీల్లో మాత్రమే సర్కార్? మౌలిక వసతులు కల్పించింది. ఇడుపుల 1, 2 గ్రామాల నిర్వాసితుల కోసం కలనూతల కాలనీలో మట్టి నింపి చదును చేస్తున్నారు. ఇంకా సౌకర్యాలు సమకూరలేదు. అక్కచెరువు తండా, గొట్టిపడియ నిర్వాసితుల కోసం ఇంటి స్థలాల హద్దు రాళ్లు పాతారు. స్థలాలు కేటాయించలేదు. గుణ్ణంచర్ల నిర్వాసితులకు ఇండ్లు నిర్మించడానికి 15 ఎకరాలను సేకరించాల్సి ఉంది.తమకు అన్యాయం జరిగిందన్న బాధిత కుటుంబాల్లో 1800 వరకు పునరావాస ప్యాకేజీకి అర్హమైనవిగా సర్కార్? గుర్తించింది. గెజిట్‌లో పేర్లు లేని వారిలో అర్హులను పరిశీలించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను నియమించి, అర్జీలు పరిశీలించారు.

## బర్డ్ డైరెక్టర్ నియామకంపై హైకోర్టులో పిల్




**అమరావతి :** బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిసెర్చ్ అండ్ రీహాబిలిటేషన్ ఫర్ డిజేబుల్డ్(బర్డ్) ఆసుపత్రి డైరెక్టర్‌గా డాక్టర్ జి.జగదీశ్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి, టీటీడీ ఈవో, చైర్మన్, బర్డ్ ట్రస్ట్ బోర్డు చైర్మన్, వ్యక్తిగత హోదాలో డాక్టర్ జగదీశ్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. తిరుమల తిరుపతి దేవస్థానములు పరిధిలోని బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్‌గా 72 ఏళ్ల డాక్టర్ జి.జగదీశ్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ చిత్తూరు జిల్లాకు చెందిన చెన్నూరు పెంచలయ్య హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది దుగ్గిరాల సుభాష్ వాదనలు వినిపించారు. టీటీడీ సర్వీస్ నిబంధనల ప్రకారం డైరెక్టర్ పోస్టును డిప్యుటేషన్ లేదా పదోన్నతి ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుందన్నారు. పదవీ విరమణ చేసినవారిని డైరెక్టర్‌గా నియమించేందుకు సర్వీస్ రూల్స్ అనుమతించవన్నారు. టీటీడీ మార్గదర్శకాల ప్రకారం పదవీ విరమణ చేసిన ఉద్యోగులను నియమించాలంటే స్క్రీనింగ్ కమిటీ పరిశీలన, టీటీడీ బోర్డు ఆమోదం తప్పనిసరి అన్నారు. డాక్టర్ జగదీశ్ నియామకం విషయంలో ఈ ప్రక్రియను అనుసరించలేదని, ముఖ్యమంత్రి కార్యాలయం సిఫార్సుతో నియామకం జరిగిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తీసుకున్న ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## సాయికృష్ణ కేసు.. హైకోర్టు విచారణపై స్టే విధించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23:** గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసును సుప్రీం ధర్మాసనం సీరియస్‌గా తీసుకుంది. సాయికృష్ణ కేసులో ఏపీ డీజీపీ, విజయవాడ కమిషనర్లపై చర్యలు తీసుకోవాలంటూ వైసీపీ ఎంపీ గురుమూర్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈరోజు(బుధవారం) జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం విచారించింది. హైకోర్టులో దాఖలైన పిటిషన్లు అన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఏపీ హైకోర్టులో విచారణపై స్టే విధించింది. సుప్రీంకోర్టులో విచారణ ముగిసేంతవరకూ హైకోర్టులో విచారణను నిలిపివేస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.పోలీసు కస్టడీలో సాయికృష్ణ అదృశ్యమవడం చట్ట వ్యతిరేకమే అని జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం పేర్కొంది. సీల్డ్ కవర్‌లో కేసుకు సంబంధించిన వివరాలన్నింటినీ సెప్టెంబర్ 30వ తేదీలోగా సుప్రీంకోర్టుకు అందజేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ప్రతివాదులందరకీ నోటీసులను జారీచేసిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను అక్టోబర్ 12వ తేదీకి వాయిదా వేసింది.

# వైభవంగా శ్రీవారి చక్రస్నానం మహోత్సవం – భారీగా తరలివచ్చిన భక్తులు

**తిరుమల:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత పవిత్రమైన చక్రస్నాన మహోత్సవంతో చివరి ఘట్టానికి చేరుకున్నాయి. వరాహస్వామి పుష్కరిణి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి వేద మంత్రోచ్చారణల నడుమ స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. అనంతరం శుభముహూర్తంలో శ్రీవారి సుదర్శన చక్రాన్ని పుష్కరిణిలో జల ప్రవేశం చేయడంతో చక్రస్నాన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకను తిలకించేందుకు వేలాది మంది భక్తులు తెల్లవారుజామున నుంచే పుష్కరిణి వద్దకు తరలివచ్చారు. మలయప్పస్వామితో పాటు సుదర్శన చక్రానికి పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. తిరుమంజనం అనంతరం సుదర్శన చక్రాన్ని పుష్కరిణిలో జల ప్రవేశం చేయగా, భక్తులు గోవింద నామస్మరణలతో హర్షధ్వానాలు చేశారు. చక్రత్తాళ్వారుకు పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు స్నానం చేయించారు. అనంతరం భక్తులకు పుష్కరిణిలో పుణ్యస్నానాలకు అనుమతి కల్పించారు. పుష్కరిణిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తు



న్నారు. చక్రస్నానం పవిత్రత రోజంతా ఉంటుందని వేద పండితులు తెలిపారు. ప్రశాంతంగా, క్రమపద్ధతిలో పుణ్యస్నానాలు ఆచరించాలని టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేసింది.

చక్రస్నాన మహోత్సవం విశిష్టత ఏమిటంటే?: పురాణాల ప్రకారం వైకుంఠంలోని విరజా నది స్వామి కన్నా ముందే భువికి దిగి వచ్చి స్వామి పుష్కరిణిగా మారిందని విశ్వసిస్తారు. స్వామి తన జలక్రీడల కోసం స్వయంగా తెప్పించుకున్న ఈ పుష్కరిణి సకల పాపహరిణిగా ప్రసిద్ధి చెందింది.శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చే భక్తులు ముందుగా శ్రీవారి ఆలయానికి ఉత్తరంగా ఉన్న ఈ పుష్కరిణిలో స్నానంచేసి, స్వామి దర్శనానికి వెళ్లాలనే నియమం ఉంది. తారకాసురుని వధించి బ్రహ్మ హత్యాదోషానికి గురైన సుబ్రహ్మణ్యస్వామి సైతం ఈ పుష్కరిణిలో స్నానం చేసి ఆ పాపాన్ని పోగొట్టుకున్నట్లు స్కంద పురాణం ద్వారా తెలుస్తోంది. ముల్లోకాలలోని సకల తీర్థాలు స్వామి పుష్కరిణిలోనే కలిసి ఉంటాయని స్వయంగా వరాహస్వామి, భూదేవికి వివరించినట్లు వరాహ పురాణం చెబుతోంది. అందుకే స్వామి పుష్కరిణిలో పవిత్ర చక్రస్నానం తర్వాతనే బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి."శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాం. అన్ని విభాగాల సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇదే స్ఫూర్తితో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం. స్పందన వచ్చిందని" టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు.చక్రస్నాన మహోత్సవంతో బ్రహ్మోత్సవాల ప్రధాన కార్యక్రమాలు ముగియగా, రాత్రి ధ్వజావరోహణంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. గురువారం నుంచి తిరుమలలో ఆర్జిత సేవలు, ప్రివిలేజ్డ్ దర్శనాలు యథావిధిగా పునఃప్రారంభం కానున్నాయని టీటీడీ వెల్లడించింది. అదేవిధంగా అక్టోబర్ 12 నుంచి 20 వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనుంది.

# 51 మంది వైసీపీ నేతలపై రౌడీ షీట్లు ఓపెన్ చేయాలంటూ ఆదేశాలు

**విజయవాడ :** విజయవాడ శాప్ కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణుల గతంలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై కూడా దాడి
దేవినేని అవినాశ్ సహా 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని సీపీ ఆదేశంమంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంపై గతంలో దాడి కేసుతో పాటు ఇటీవల విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను తీవ్రంగా పరిగణిస్తూ విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. నగరం పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారంటూ ప్రతిపక్ష వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సహా మొత్తం 51 మందిపై వెంటనే రౌడీషీట్లు తెరవాలని స్థానిక పోలీస్ స్టేషన్ల సీఐలను ఆదేశించారు. ఈ రౌడీషీటర్ల జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఆ పార్టీ సీనియర్ నాయకుడు దేవినేని అవినాశ్, మాజీ ఫ్లోర్ లీడర్ అరవ సత్యం, మాజీ కార్పొరేటర్ కాలపాల అంబేద్కర్ సహా పలువురు ముఖ్య నాయకుల పేర్లు ఉన్నాయి. విజయవాడ పరిధిలోని భవానీపురం,



అజిత్‌సింగ్‌నగర్, నున్న, కృష్ణలంక, మాచవరం, పటమట, గవర్నర్‌పేట తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేసే ప్రక్రియను క్షేత్రస్థాయి ఏసీపీలు నేరుగా పర్యవేక్షించాలని కమిషనరేట్ ఆదేశాల్లో పేర్కొన్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పోలీసు శాఖ స్పష్టం చేసింది. మరోవైపు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తమ నాయకులపై కక్షపూరితంగానే ఈ చర్యలు తీసుకుంటున్నారని వైసీపీ ఆరోపిస్తోంది.

## బీజేపీలో కీలక మార్పులు.. ఏపీ, తెలంగాణకు కొత్త ఇన్‌చార్జిలు

**అమరావతి**

బీజేపీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక మార్పులు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జిలు, కో-ఇన్‌చార్జిలను నియమించింది. ఏపీ బీజేపీ ఇన్‌చార్జిగా డాక్టర్ అరవింద్ భదౌరియాను, కో–ఇన్‌చార్జిగా శ్రీమతి వనతి శ్రీనివాసన్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్‌ను, కో–ఇన్‌చార్జిలుగా అభయ్ పాటిల్, శ్రీమతి రేఖా శర్మలను నియమించింది. రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేయడం.. రాష్ట్ర నాయకత్వంతో కలిసి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం ఇన్‌చార్జిల ప్రధాన బాధ్యతల్లో భాగంగా ఉంటుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో 28 జిల్లాలకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జిలను నియమించడంతో పాటు.. రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో తాజా జాతీయ స్థాయి నియామకాలు వచ్చాయి.ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులకు ఇతర రాష్ట్రాల సంస్థాగత బాధ్యతలను పార్టీ అప్పగించింది. బీజేపీ ఏపీ నేత, మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురందేశ్వరిని బీజేపీ ఒడిశా ఇన్‌చార్జిగా నియమించారు. తెలంగాణకు చెందిన డీకే అరుణను తమిళనాడు బీజేపీ కో–ఇన్‌చార్జిగా, డాక్టర్ కసమ్ వెంకటేశ్వర్లును కర్ణాటక బీజేపీ కో–ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో తెలుగు రాష్ట్రాల నాయకులకు ఇతర రాష్ట్రాల్లో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు కూడా దక్కాయి. .



# వెండికొండ మీరాబాయి

### వెయిట్‌లిఫ్టింగ్‌లో రజతం సొంతం


### బ్యాడ్మింటన్‌లో మెన్స్ జట్టుకు కాంస్యం

### 2026 ఆసియా క్రీడలు

ఓ ఒలింపిక్ పతకం, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో మూడు మెడల్స్. కామన్‌వెల్త్ క్రీడల్లో మరో మూడు పతకాలు. ఆసియా చాంపియన్‌షిప్స్‌లోనూ ఓ మెడల్. ప్రతిష్టాత్మక క్రీడా ఈవెంట్లలో అన్నింటా పోడియం ఫినిష్ చేసినా, అయినా ఏదో వెలితి. అదే ఆసియా క్రీడల్లో మెడల్. 2026లో ఆ లోటును తీర్చుకుంది దిగ్గజ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను. ఆసియా క్రీడల్లో మహిళల 49 కేజీల విభాగంలో మీరాబాయి చాను రజత పతకం సాధించింది.ఆసియా క్రీడల్లో భారత వెయిట్‌లిఫ్టింగ్ పతక నిరీక్షణకు తెరపడింది. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో తెలుగు తేజం కరణం మల్లీశ్వరి మహిళల 63 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా.. సరిగ్గా 28 ఏండ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మరో భారత వెయిట్‌లిఫ్టర్ వెండి కాంతులతో వెలుగొందింది. ఇటు భారత్‌తో పాటు మీరాబాయి చానుకు సైతం ఆసియా క్రీడల్లో పతక వెలితి వేధించింది. 2014 ఆసియా క్రీడల్లో తొలిసారి పోటీపడిన మీరాబాయి చాను తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2018 జకర్తా ఆసియా క్రీడలకు గాయంతో దూరమైంది. 2023 గాంగ్జౌ ఆసియా క్రీడల్లో నాల్గో స్థానంతో పతకానికి అడుగు దూరంలో ఆగిపోయింది. టోక్యో ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్‌తో శిఖర స్థాయికి చేరుకున్న మీరాబాయి చాను.. ఆసియా క్రీడల్లో పసిడి ఫేవరేట్‌గా బరిలోకి దిగింది. 49కేజీల మహిళల విభాగంలో స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలు ఎత్తింది. ఓవరాల్‌గా 198 కేజీలతో మీరాబాయి చాను రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్, డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ రి సంగ్ గమ్ 215 కేజీలతో (94o121) బంగారు పతకం నిలుపుకుంది. ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా వెయిట్‌లిఫ్టర్‌కు ఇది వరుసగా మూడో బంగారు పతకం. ఇండోనేషియా వెయిట్‌లిఫ్టర్ లులుక్ దయానా 191 కేజీలు (88o103) మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో మీరాబాయి చాను 83 కేజీలు, 85 కేజీలు, 87కేజీలు ఎటువంటి తడబాటు లేకుండా అలవోకగా ఎత్తిపడేసింది. క్లీన్ అండ్ జెర్క్‌లో తొలుత 107 కేజీలు ఎత్తిన మీరాబాయి చాను ఆ తర్వాత 111 కేజీలతో మెరుగైంది. కానీ ఆ తర్వాత మూడో ప్రయత్నం చేయలేదు. 'కొంత ఒత్తిడి ఉండేది. కానీ పతకం నెగ్గుతానా లేదా అనేంత ఒత్తిడి కాదు. మెడల్ సాధిస్తాననే నమ్మకం నాకుంది. నన్ను నమ్మేవాళ్లకు నాపై అంచనాలు ఉన్నాయి. నా కోచ్‌లు, సహాయక సిబ్బంది నేను దేశానికి మరో మెడల్ సాధించేందుకు సహకరించారు'అని మీరాబాయి చాను తెలిపింది. మహిళల 53 కేజీల విభాగంలో పోటీపడిన జ్ఞానేశ్వరి యాదవ్ 195 కేజీలు (87o108)తో ఎనిమిదో స్థానంలో నిలిచింది. **బ్యాడ్మింటన్‌లో కాంస్యం** పురుషుల బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లో భారత్ కాంస్య పతకం సాధించింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో అగ్రజట్టు చైనా చేతిలో భారత్ 1-3తో పరాజయం పాలైంది. తొలి సింగిల్స్‌లో లక్ష్యసేన్ 16-21, 18-21తో షి యుకి చేతిలో ఓడాడు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 21-11, 22-2-తో లియాంగ్, వాంగ్‌లపై గెలుపొంది లెక్క సమం చేశారు. రెండో సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 19-21, 13-21తో షి ఫెంగ్ చేతిలో కంగుతిన్నాడు. రెండో డబుల్స్‌లో హరిహరణ్, ఎంఆర్ అర్జున్ జోడీ 16-21, 9-21తో నిరాశపరిచారు. దీంతో చైనా 3-1తో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌లో ఓటమితో భారత్ కాంస్య పతకంతో సరిపెట్టుకుంది.వుషూలో భారత్ కనీసం సిల్వర్ మెడల్ ఖాయం చేసుకుంది. మహిళల వుషూ 60 కేజీల విభాగంలో రోషిబినా దేవి పసిడి పోరుకు చేరుకుంది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో ఇండోనేషియా అమ్మాయి తానియాపై 2-0తో రోషిబినా దేవి గెలుపొందింది. నేడు ఫైనల్లో పసిడి పతకం కోసం చైనా అమ్మాయి జాంగ్‌తో రోషిబినా దేవి పోటీపడనుంది.



**షూటింగ్‌లో డబుల్ ధమాకా** షూటింగ్‌లో భారత్ బుధవారం డబుల్ ధమాకా మోగించింది. స్కీట్ టీమ్ విభాగంలో భారత పురుష, మహిళల జట్లు కాంస్య పతకం సాధించాయి. మహేశ్వరి చౌహాన్, పరినాజ్ దాలివాల్, రైజా ధిల్లాన్‌లతో కూడిన మహిళల జట్టు 331 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం నెగ్గింది. చైనా (357), కజకిస్తాన్ (336) గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించాయి. అనంత్‌జిత్ సింగ్, మేరాజ్ అహ్మద్ ఖాన్, భవతేజ్ సింగ్ గిల్‌తో కూడిన మెన్స్ జట్టు 346 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. స్టార్ షూటర్ మను భాకర్ మహిళల 10మీ ఎయిర్ పిస్టల్ విభాగంలో ఐదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. 10మీ ఎయిర్ పిస్టల్ జట్టు విభాగంలో ఇషా సింగ్, సురుచి సింగ్, మను భాకర్ త్రయం వియత్నాంతో కలిసి 1719 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచినా.. మెరుగైన ఇన్నర్ 10 స్కోరింగ్‌తో వియత్నాం కాంస్య పతకం దక్కించుకుంది. **సాఫ్ట్‌టెన్నిస్‌లో మెడల్ ఖాయం** ఆసియా క్రీడల్లో భారత్ తొలిసారి సాఫ్ట్ టెన్నిస్‌లో పతకం ఖాతాలో వేసుకోనుంది. పురుషుల వ్యక్తిగత సాఫ్ట్‌టెన్నిస్‌లో జే మీనా సెమీఫైనల్‌కు ప్రవేశించాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో షెర్విన్ నుగియట్‌పై ఏడు గేముల థ్రిల్లర్‌లో గెలుపొందాడు. 0-4, 4-2, 2-4, 4-2, 5-3, 2-4, 7-5తో జే మీనా విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాడు. జే మీనా సెమీస్‌లో అడుగుపెట్టి కనీసం కాంస్య పతకం ఖాయం చేసుకున్నాడు.



# సాఫ్ట్ టెన్నిస్‌లో కాంస్య పతకం

హైదరాబాద్: ఆసియా క్రీడల సాఫ్ట్ టెన్నిస్ విభాగంలో భారతదేశం చారిత్రక ఘనత సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల క్రీడాకారుడు జయ్ మీనా కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఆసియా గేమ్స్ చరిత్రలోనే ఈ క్రీడలో భారత్‌కు పతకం దక్కడం ఇదే తొలిసారి.బుధవారం నాటి సెమీఫైనల్ పోరులో జపాన్‌కు చెందిన టకుయా కురోసాకాతో జయ్ మీనా తలపడ్డాడు. 45 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ ప్రారంభంలో జయ్ వరుసగా మూడు గేమ్‌లు ఓడిపోయి ఒత్తిడిలో పడ్డాడు. ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుని వరుసగా రెండు గేమ్‌లను (4-1, 6-4) తన ఖాతాలో వేసుకుని మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు.



# ఆసియా క్రీడల్లో భారత్‌కు డబుల్ పతకాలు

ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. బుధవారం రెండు ఈవెంట్లలో మెడల్స్ దక్కాయి. స్కీట్ టీమ్ విభాగంలో భారత మహిళ, పురుష జట్లు కాంస్యం దక్కించుకున్నాయి. అటు భారత స్టార్ షూటర్ మను బాకర్ నిరాశకు గురిచేసింది. మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రైజా దిల్లాన్, మహేశ్వరి చౌహాన్, పరినాజ్ ధలీవాల్.. 331 స్కోరుతో మూడో స్థానంలో నిలిచారు. దీంతో కాంస్యం దక్కింది. ఈ ఈవెంట్‌లో చైనా బృందానికి బంగారు పతకం రాగా.. కజకిస్థాన్ టీమ్ రజతం గెలిచింది.ఇక, పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకా, భవతేగ్ సింగ్ గిల్, మైరాజ్ అహ్మద్ ఖాన్.. 346 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించారు. మరోవైపు, వ్యక్తిగత విభాగంలో అనంత్‌జీత్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఒలింపిక్‌లో డబుల్ మెడల్స్‌తో ఆకట్టుకున్న మనుబాకర్‌కు.. ఆసియా గేమ్స్‌లో నిరాశ ఎదురైంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కొద్దిలో ఆమె పతకం చేజార్చుకుంది. ఫైనల్ పోరులో 181.1 స్కోరుతో మను ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్ల బృందం కాంస్యాన్ని త్రుటిలో మిస్ అయ్యింది. అటు సాఫ్ట్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు జై మీనాకు కాంస్యం దక్కింది. సెమీస్‌లో జపాన్ క్రీడాకారుడి చేతిలో జై 2-4తో ఓటమిపాలయ్యాడు.

# కుర్రాళ్లు కుమ్మేశారు.. ఆసీస్‌తో సిరీస్ క్లీన్ స్వీప్



రాజ్‌కోట్: ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన మూడు అనధికారిక వన్డేల సిరీస్‌ని భారత అండర్-19 జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో అనధికారిక వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ నామమాత్రపు మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ జెడ్ హోలిక్(87), నీల్ పటేల్(51) అర్ధ శతకాలతో రాణించారు. భారత బౌలర్లలో మోహిత్ ఉల్వ, మోనల్ చౌహాన్ తలో మూడు వికెట్లు తీయగా.. ఆర్యన్ సవసాని, కావ్య పటేల్ చెరో వికెట్ పడగొట్టారు.అనంతరం లక్ష్య చేధనకు దిగిన భారత్‌కు మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ శుభారంభం అందించాడు. 31 బంతులు ఎదురుకున్న అతడు 5 ఫోర్ల సాయంతో 34 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. అనంతరం కెప్టెన్ లక్ష్య రాయ్‌చందన్ ఆసీస్ బౌలర్లను టార్గెట్ చేశాడు. ఆచితూచి ఆడుతూ.. 100 బంతుల్లో సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 106 బంతులు ఎదురుకున్న అతడు 9 ఫోర్లు, 3 సిక్సులతో 110 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరితో పాటు కుశాగ్ర ఓఝా(45), రజత్ బఘేల్ (44 నాటౌట్) రాణించారు. ఫలితంగా భారత్ 4 వికెట్లు కోల్పోయి 41.2 బంతుల్లో లక్ష్యాన్ని చేధించింది. ఆసీస్ బౌలర్లలో స్పెన్సర్ గ్రీన్ రెండు వికెట్లు సాధించాడు.

# కెప్టెన్ శతకం వృథా.. రెండో వన్డేలో ఆసీస్ చేతిలో భారత్ ఓటమి

మొహాలీ: మూడు అనధికారిక వన్డేలు, మూడు అనధికారిక టి-20లు, ఒక అనధికారిక టెస్ట్ ఆడేందుకు ఆస్ట్రేలియా మహిళల ఎ జట్టు భారత్‌కు వచ్చింది. ఇందులో భాగంగా టి-20 సిరీస్‌ను కంగారూ జట్టు 3-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. అయితే ఆదివారం జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ విజయం సాధించింది. అయితే మొహాలీ వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 338 పరుగుల భారీ స్కోర్‌ను సాధించింది. కెప్టెన్ యస్తికా భాటియా సెంచరీతో చెలరేగింది. 84 బంతుల్లోనే 16 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 112 పరుగులు చేసింది. ఇక తేజల్ హసాబ్నిస్ (60), అనుష్క శర్మ (60 నాటౌట్) అర్ధ శతకాలు సాధించారు. ఆసీస్ బౌలింగ్‌లో డార్సీ బ్రౌన్ మూడు వికెట్లు, మిల్లీ ఇల్లింగ్‌వర్త్ రెండు వికెట్లు, లల్లీ మిల్స్ ఒక వికెట్ తీశారు.అనంతరం లక్ష్య చేధనలో ఆసీస్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ నికోలి ఫాల్టుమ్(12)ను సయాలీ సత్గరే తక్కువ స్కోర్‌కే పెవిలియన్ పంపింది. కానీ ఆ తర్వాత మరో ఓపెనర్ తాహిలా విల్సన్ (79), అనికా లిరాయిడ్ (54) హాఫ్ సెంచరీలు చేశారు. ఇక చార్లి నాట్ 37 బంతుల్లోనే 63 పరుగులతో అదరగొట్టింది. హేలీ సిల్వర్ హోమ్స్ (47), టెస్ ఫ్లింటాఫ్ (38) పరుగులతో రాణించారు. అయితే భారత బౌలర్లు విజయం సాధించడానికి ఆఖరి వరకూ పోరాడారు. కానీ, విజయం మాత్రం ఆసీస్‌ని వరించింది. 49.3 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయిన ఆసీస్ 341 పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఫలితంగా ఈ సిరీస్‌ని 1-1 తేడాతో సమం చేసింది. మూడో వన్డే శుక్రవారం మొహాలీ వేదికగా జరగనుంది.



# కూచిపూడితో మెప్పించిన డింపుల్ హయాతి.. తిరుమలలో ప్రత్యేక ప్రదర్శన!



టాలీవుడ్ అందాల భామ డింపుల్ హయాతి తిరుమలలోని నాద నీరాజనం వేదికపై అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి భక్తులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎరుపు, గోల్డ్ కలర్ సిల్క్ చీర కట్టి, సంప్రదాయ వస్త్రధారణలో భక్తిశ్రద్ధలతో ఆమె ప్రదర్శించిన కూచిపూడి నాట్యం అందరినీ మంత్రముగ్ధులను చేసింది.ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఆ విశేషాలు చూద్దాం.. శ్రీవారి బ్రహ్మోత్సవాల పవిత్ర సమయంలో డింపుల్ హయాతి నాద నీరాజనం వేదికపై కూచిపూడి నాట్యం చేయడం విశేషం. సంప్రదాయబద్ధమైన నృత్య భంగిమలు, చక్కటి ముఖకవళికలతో ఆమె చేసిన ప్రదర్శన భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఇక నృత్య ప్రదర్శనకు ముందు రోజు ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. నెటిజన్ల ఆశ్చర్యం, ప్రశంసలు : ఇన్నాళ్లూ సినిమాల్లో గ్లామరస్ పాత్రల్లో అలరించిన డింపుల్ హయాతిలో ఈ స్థాయి సంప్రదాయ నాట్య ప్రతిభ కూడా ఉందా అని నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె డ్యాన్స్ వీడియోలు చూసిన అభిమానులు "డింపుల్ గారు చాలా అందంగా, అద్భుతంగా నాట్యం చేశారు" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.సినిమా కెరీర్ మరియు క్రేజ్: తెలుగు, తమిళ సినిమాల్లో నటించి మంచి నటిగా పేరు తెచ్చుకున్న డింపుల్, వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' చిత్రంలో 'జర్రా జర్రా' స్పెషల్ సాంగ్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆ తర్వాత ఖిలాడి, రామబాణం, ఆత్రంగి రే, వీరమే వాగై సూడుమ్, భర్త మహాశయులకు విజ్ఞప్తి వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు దగ్గరైంది. 'ఆదర్శ కుటుంబం'తో త్వరలో ముందుకు: ప్రస్తుతం సరైన సినిమా బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న డింపుల్ హయాతి, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నట్టు టాక్. ఈ భారీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం అక్టోబర్ 9న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమాతో ఆమెకు పెద్ద హిట్ అందుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఇక అంతేగాక శర్వానంద్ 38వ సినిమా సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో ఓ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.వెండితెరపై తన గ్లామర్, నటనతో ఆకట్టుకునే డింపుల్ హయాతి, తిరుమలలో ప్రదర్శించిన కూచిపూడి నాట్యంతో తనలోని సంప్రదాయ కళాత్మక కోణాన్ని ఆవిష్కరించారు. భక్తిభావంతో ఆమె చేసిన ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరి మనసులను దోచుకోవడమే కాకుండా, ఆమె కెరీర్‌కు మరింత సానుకూలతను తీసుకువస్తుందనడంలో సందేహం లేదు.


# ఇక మైత్రీ థియేటర్లలో 'సర్వపిండి'..

## సినిమా చూస్తూ కమ్మని రుచి.. 'ది ప్యారడైజ్'తో ఎంట్రీ!




ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ 'మైత్రీ' తమ థియేటర్ల ద్వారా ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. సినిమా అనుభూతికి తెలంగాణ సంస్కృతిని, అచ్చమైన పల్లె రుచులను జోడిస్తూ సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇకపై తమ థియేటర్లలో తెలంగాణ సంప్రదాయ వంటకమైన 'సర్వపిండి'ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.
తొలి దశలో భాగంగా మైత్రీ విమల్, మైత్రీ శివగంగ థియేటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నారు. త్వరలో విడుదల కానున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్' ప్రదర్శన సమయంలో విరామంలో ప్రేక్షకులు ఈ కమ్మని సర్వపిండిని ఆస్వాదించవచ్చు. సినిమా చూస్తూనే, తెలంగాణ ప్రత్యేక వంటకాన్ని రుచి చూసే ఈ కొత్త అనుభవం సినీ ప్రియులను ఆకట్టుకుంటుందని సంస్థ భావిస్తోంది.ఈ సరికొత్త ఆలోచన వెనుక సోషల్ మీడియాలో ప్రజాదరణ పొందిన 'బామ్మాస్టోరిస్'కు చెందిన 77 ఏళ్ల బామ్మ కృషి ఉంది. ఓ చిన్న టిఫిన్ సెంటర్‌లో ఆమె ప్రేమతో తయారు చేసే సర్వపిండి, ఇప్పుడు ఏకంగా బిగ్ స్క్రీన్ ప్రేక్షకులకు చేరువ కావడం విశేషం. వెండితెరపై దృశ్యాలను ఆస్వాదిస్తూనే, తెలంగాణ అసలైన రుచిని అందించాలన్న మైత్రీ థియేటర్స్ ప్రయత్నంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది.. కానీ!: శివాజీ



టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు.ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు.'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.

# 'ప్యారడైజ్'లో నాని 'జడల్' పాత్రకు స్ఫూర్తి ఈ ఫొటోనే!



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన తాజా యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. ఈ చిత్రం రేపు (సెప్టెంబరు 24) విడుదల కానున్న నేపథ్యంలో, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాలోని కీలకమైన 'జడల్' పాత్రకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ పాత్రకు, ముఖ్యంగా నాని జడల లుక్‌కు తన చిన్ననాటి జ్ఞాపకాలే స్ఫూర్తి అని ఆయన వెల్లడించారు.
ఈ సందర్భంగా శ్రీకాంత్ ఓదెల సోషల్ మీడియాలో తన చిన్ననాటి ఫొటోను పంచుకుంటూ ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "జడల్ పుట్టుక, యుద్ధం కల్పితం కావచ్చు... కానీ అతని జడలు, లుక్ నా చిన్నప్పటి స్ఫూర్తితో వచ్చినవే. అమ్మ నాకు 5, 6 ఏళ్ల వయసు వరకు జడలు వేసి కట్టేవారు. నేను పెద్దయ్యాక, కమర్షియల్ సినిమాలో ఒక హీరో జడలతో 70ఎమ్ఎమ్ స్క్రీన్‌పై ఎలా ఉంటాడా అని ఎప్పుడూ ఊహించుకునేవాడిని. ఇప్పుడు నా హీరో నాని అన్నను జడల్‌గా మీ ముందు ఉంచుతున్నాను. ఈ చిత్రం కేవలం నా చిన్నతనం కాదు, నా ప్యారడైజ్" అని ఆయన పేర్కొన్నారు.
శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు పంచుకున్న ఈ వ్యక్తిగత విషయం



# తెలుగు ఇండస్ట్రీని చూసి కన్నీళ్లొచ్చాయి : 'ది ప్యారడైజ్' నటుడు రాఘవ్ జుయల్

ప్రముఖ డ్యాన్సర్, నటుడు రాఘవ్ జుయల్.. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ, ఇక్కడి పని సంస్కృతిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలుగు పరిశ్రమలో సినిమాను ఒక వేడుకలా జరుపుకునే విధానం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు, సినిమా నిర్మాణం పట్ల ఇక్కడి వారికి ఉన్న అభిరుచి, గౌరవాన్ని దగ్గర నుంచి చూశానని రాఘవ్ తెలిపారు.
ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడ సినిమాను, సినిమా వాళ్లను ఎంతగా గౌరవిస్తారో చూసి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ప్రతి ఒక్క టెక్నీషియన్‌కు ఎంతో గౌరవం ఇస్తారు. సౌండ్ ఇంజనీర్‌ను కూడా ప్రేక్షకులు గుర్తుపట్టడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇక్కడ వారు కేవలం పని పూర్తి చేయడానికి రారు, సినిమాను సెలబ్రేట్ చేసుకోవడానికి వస్తారు. ఈ విషయాన్ని నేను నేర్చుకున్నాను" అని భావోద్వేగంగా చెప్పారు. తనపై దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రభావం ఎంతో ఉందని కూడా రాఘవ్ చెప్పుకొచ్చారు.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో పుట్టి పెరిగిన రాఘవ్, 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ 3' రియాలిటీ షోతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 'క్రాక్‌రాక్స్' అనే స్టేజ్ పేరుతో తన స్లో-మోషన్ డ్యాన్సింగ్ స్టైల్‌తో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తర్వాత 'డ్యాన్స్ ప్లస్' వంటి అనేక విజయవంతమైన టీవీ షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు.

# నంది అవార్డుల కోసం దరఖాస్తు విధానం- మార్గదర్శకాలు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ - నాటకరంగ అభివృద్ధి సంస్థ (విజయవాడ) 2025 సంవత్సరానికి సంబంధించిన -చలనచిత్ర నంది బహుమతులు - 2025- , ౦౦ నంది బహుమతులు - 2025- కోసం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమను, టెలివిజన్ రంగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఈ పురస్కారాలను అందజేస్తోంది. అర్హులైన నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణుల నుండి దరఖాస్తులను సంస్థ ఆహ్వానించింది. చలనచిత్ర విభాగంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నంది చలనచిత్ర నిబంధనలను అనుసరించి 2025 సంవత్సరానికి ఉత్తమ ఫిల్మ్ నిర్మాతలు, ఉత్తమ కళాకారులు.. ఉత్తమ సాంకేతిక నిపుణులకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. తెలుగు భాషలో భారతదేశంలో ఎక్కడైనా నిర్మించి.. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ -సీబీఎఫ్‌సీ ద్వారా థియేటర్లలో ప్రదర్శించిన చిత్రాలు, జాతీయ సమైక్యతపై చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యాసంబంధమైన చిత్రాలు అలాగే తెలుగు సినిమా మీద వచ్చిన పుస్తక రచనలు, రచయితలు, నిర్మాతలు దరఖాస్తు




చేసుకోవడానికి అర్హులు.
ఇక టెలివిజన్ రంగానికి సంబంధించి 2025 సంవత్సరానికి నంది టి.వి. చిత్ర నిబంధనల ప్రకారం ఉత్తమ టి.వి. చిత్ర నిర్మాతలు, కళాకారులు, సాంకేతిక నిపుణులను సత్కరించనున్నారు. టెలిఫిల్మ్స్, టి.వి. ఫీచర్స్, టి.వి. మెగాసీరియల్స్, డైలీ సీరియల్స్, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, సామాజిక అంశాలు, విద్య సంబంధిత చిత్రాల రూపకర్తలు ఈ బహుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవార్డులకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు.. ఇతర వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ **www.apsftvdc.in** ద్వారా తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను



పొందుపరుచుటకు చివరి తేదీగా 12.10.2026ను నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల ప్రింట్ ప్రతులను సంబంధిత డాక్యుమెంట్లతో జతపరిచి నిర్దేశిత గడువులోగా అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల హార్డ్ కాపీలను -మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థ, 4వ అంతస్తు, ఎన్.టి.ఆర్. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, పండిత్ నెహ్రూ బస్ కాంప్లెక్స్, విజయవాడ - 520013- చిరునామాకు పంపడానికి చివరి తేదీ 16.10.2026గా ఖరారు చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఐ.ఏ.ఎస్., తెలిపారు. కళాకారులు - నిర్మాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569